


మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంటే.. నవ్యాంధ్రలో స్వర్ణయుగం సాకారం అవుతుంది.సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింది. రాష్ట్రంలో పలుమార్లు అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 2లక్షల పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీదే.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 22.08.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 122 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పట్టణాలకు 'మెగా' రూపురేఖలు!



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల రూపురేఖలను సమూలంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం భారీ పట్టణాభివృద్ధి కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా మొత్తం రూ.40,743 కోట్ల అంచనా వ్యయంతో మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపడుతుండగా, తొలి దశలో రూ.7,469.46 కోట్ల విలువైన పనులకు పురపాలక శాఖ పరిపాలనా అనుమతులు జారీ చేసింది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, సెంట్రల్ మీడియన్లు, వీధిదీపాల నిర్మాణం చేపట్టనున్నారు.

ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో అమలు కానున్న ఈ

మిగతా 2లో...

- 123 మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.40,743 కోట్ల ప్రణాళిక
- తొలిదశలో రూ.7,469 కోట్లతో మౌలిక వసతుల పనులు
- 4,388 కి.మీ. రోడ్లు.. 541 పార్కుల నిర్మాణం
- 20,340 వీధిదీపాలతో పట్టణాలకు కొత్త వెలుగు



# బడి మారింది.. బొమ్మరిల్లు అయింది!



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** ఒకప్పుడు వర్షం పడితే నీటితో మునిగిపోయి విద్యార్థులు అడుగుపెట్టలేని ప్రభుత్వ పాఠశాల.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, కృత్రిమ మేధ ల్యాబ్‌తో రాష్ట్రంలోనే ఆదర్శ విద్యాలయంగా నిలిచింది. విశాఖ మధురవాడ పరిధిలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఏడాది క్రితం ప్రత్యేక చొరవ చూపగా, దివీస్ సంస్థ సామాజిక బాధ్యత నిధులతో కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఆధునికీకరించిన ఈ విద్యాలయాన్ని శుక్రవారం మంత్రి లోకేష్ ప్రారంభించనున్నారు.

రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ముందువరుసలో ఉంది. ప్రస్తుతం ఇక్కడ 2,900 మంది విద్యార్థులు, 104 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందించడంతో ఈ పాఠశాలకు

మిగతా 2లో...

లోకేష్ చొరవతో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌కు కొత్త రూపు

62 తరగతి గదుల్లో డిజిటల్ ప్యానెళ్లు.. ఏఐ, రోబోటిక్స్ ల్యాబ్‌లు

2,900 మంది విద్యార్థులకు అత్యాధునిక వసతులు

నేడు ఆధునీకరించిన పాఠశాలను ప్రారంభించనున్న మంత్రి

# మంత్రి సత్యకుమార్ సంకల్పంతో ఆయుష్‌కు మహార్దశ

- **రూ.221.67 కోట్ల** వ్యయంతో ఆసుపత్రులు, కళాశాలల భవన నిర్మాణాలకు శ్రీకారం
- ఇందులో **6** ఆయుష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, రెండు వైద్య కళాశాలలు
- **12** చోట్ల పనుల ప్రారంభానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- మంత్రి సత్యకుమార్ వెల్లడి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వైద్య మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయుష్ వైద్య సేవలు, వైద్య విద్యకు అవసరమైన భవనాల నిర్మాణంతో పాటు అల్లోపతి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనపు వసతుల కల్పనకు మొత్తం రూ.221.67 కోట్ల అంచనా వ్యయంతో 12 పనులకు టెండర్లను పిలిచినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వీటిలో 10 పనులు ఆయుష్ విభాగానికి, రెండు పనులు అల్లోపతి వైద్య విభాగానికి సంబంధించినవి ఉన్నాయని ఓ ప్రకటనలో వెల్లడించారు.

మిగతా 2లో...



# శరవేగంగా.. అమరావతి!

- 29న సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశకు శ్రీకారం
- మరో 15 రోజుల్లో ఎలివేటెడ్ కారిడార్ పనులు
- ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాల పూర్తి లక్ష్యం



**తుళ్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ నిర్మాణ పనులను ఈ నెల 29న ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. అమరావతి నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, రైతుల త్యాగాలు, సహకారంతోనే రాజధాని తిరిగి రూపుదిదుకుంటోందని అన్నారు. తుళ్లూరులో శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ బాలకోటేశ్వరస్వామి

మిగతా 2లో...

## 24న ముసునూరుకు ఉపరాష్ట్రపతి



**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్) :** భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ఈనెల 24వ తేదీన ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 7. 15 నిలకు ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9. 35 నిలకు గన్నవరం చేరుకుంటారు. 9. 45 నిలకు గన్నవరం నుండి రోడ్డు మార్గాన బయలుదేరి, 10. 45 నిలకు ముసునూరులోని గౌర్మెట్ పాప్‌కార్నికా ఫ్యాక్టరీకి చేరుకుంటారు. మధ్యాహ్నం 12. 15 నిమిషాల వరకు నూతన పాప్‌కార్న్ సీడ్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. రైతులను సన్మానిస్తారు. అనంతరం 12. 35 నిలకు ముసునూరు నుండి రోడ్డుమార్గాన గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళతారు.

మరిన్ని కథనాలు లోపలి పేజీల్లో

## పీజీ కోర్సుల ఫీజులు పెంపు!

- కన్వీనర్ కోటాలో 17.5% పెంపు
- అన్ని పీజీ కోర్సులకు వర్తింపు
- తుది ఫీజులు ఖరారయ్యే వరకు మధ్యంతర ఫీజుల అమలు
- ప్రభుత్వ, కన్వీనర్ కోటా ప్రవేశాలకే వర్తింపు

## ఉత్తరాంధ్రకు సీఎం చంద్రబాబు

- మూడు జిల్లాల్లో విస్తృత పర్యటన
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో మమేకం
- విశాఖలో బ్రిక్స్ సమావేశాలకు హాజరు


## ఎంపీపీ రిజర్వేషన్లలో కీలక మార్పు

- ఎంపీపీ రిజర్వేషన్లలో రాష్ట్ర యూనిట్ విధానం
- డెడికేటెడ్ కమిషన్ సవరణ ప్రతిపాదనలు
- 661 ఎంపీపీల్లో 152 బీసీలకు

## పంచాయతీల్లో బీసీలకు 34% రిజర్వేషన్!

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- సర్పంచ్ నుంచి జడ్పీ చైర్మన్ వరకు వర్తింపు
- 24.14% నుంచి మళ్లీ 34 శాతానికి పునరుద్ధరణ
- ఎన్నికల నిర్వహణకు చర్యలు వేగవంతం

## 629 పోస్టులకు 1.05 లక్షల పోటీ!



- 23 నుంచి ఏఈఈ కంప్యూటర్ పరీక్షలు
- ఐదు రోజుల పాటు రెండు విడతల్లో నిర్వహణ
- ముఖ గుర్తింపు, మెటల్ డిటెక్టర్లతో పకడ్బందీ భద్రత

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 27 వరకు

మిగతా 2లో...

## భోగాపురానికి అరగంటకో 'ఈ-బస్సు'



- విశాఖపట్నం నుంచి ప్రతి 30 నిమిషాలకు సర్వీసు
- విమానాల సమయాలకు అనుగుణంగా బస్సుల నిర్వహణ
- ప్రయాణికుల సౌకర్యాలపై మంత్రి ఆరా


**విజయనగరం(జర్నలిస్ట్ ఫైల్) :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం నుంచి ప్రతి అరగంటకు ఒక ఎలక్ట్రిక్ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం విశాఖపట్నం నుంచి ఎలక్ట్రిక్ బస్సులో విమానాశ్రయానికి చేరుకుని అక్కడి రవాణా సౌకర్యాలను పరిశీలించారు.

విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన బస్‌స్టాండ్, ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ స్టేషన్‌ను మంత్రి పరిశీలించి, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడు నుంచి నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. బస్సుల రాకపోకలు, చార్జింగ్ వ్యవస్థ, ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో...

## తిరుమలలో ఈసారి రెండు బ్రహ్మోత్సవాలు!

- సెప్టెంబరు 15 నుంచి సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- అక్టోబరు 12 నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- అధిక మాసం నేపథ్యంలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు
- గరుడ సేవకు ప్రత్యేక సన్నాహాలు



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) :** అధిక మాసం కారణంగా ఈ ఏడాది తిరుమలలో సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. బ్రహ్మోత్సవాల నిర్వహణపై టీటీడీ ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి జిల్లా యంత్రాంగంతో అన్నమయ్య భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించి, అనంతరం ఆలయ మాడవీధులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు.

మిగతా 2లో...


# పీజీ కోర్సుల ఫీజులు పెంపు!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రంలోని అన్ని పీజీ కోర్సులకు కన్వీనర్ కోటా కింద ప్రవేశం పొందే విద్యార్థుల ఫీజులను తాత్కాలికంగా 17.5 శాతం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఫార్మసీ, ఫార్మా-డీ, ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీతో పాటు ఇతర అన్ని పీజీ కోర్సులకు ఈ పెంపు వర్తించనుంది.

కొత్త ఫీజు నిర్మాణాన్ని నిర్ణయించేందుకు మరింత సమయం అవసరమవడంతో గత ఏడాది అమలులో ఉన్న ఫీజులపై 17.5 శాతం పెంపుతో మధ్యంతర ప్రాథమిక ఫీజులను అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇవి తుది ఫీజులు కాదని స్పష్టం చేసింది.

ఫీజుల నియంత్రణ కమిటీ తుది ఫీజులను ప్రకటించిన అనంతరం, మధ్యంతరంగా చెల్లించిన మొత్తానికి తుది ఫీజుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని విద్యార్థులు సంబంధిత కళాశాలలకు చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయం ప్రభుత్వ, కన్వీనర్ కోటా

# ఉత్తరాంధ్రకు సీఎం చంద్రబాబు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో మమేకం కానున్నారు. ఉదయం అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం అలమండ గ్రామానికి చేరుకుని స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.05 గంటలకు ఏ.కొడూరు జెడ్పీ హై స్కూలు సమీపంలోని ప్రజా వేదికకు సీఎం చేరుకుంటారు. మధ్యాహ్నం 1.15 గంట వరకు జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2.20 గంటలకు పార్టీ కేడర్ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరవుతారు. అనకాపల్లి పర్యటన ముగించుకుని విజయనగరం జిల్లా ఎస్.కోటకు సీఎం చేరుకుంటారు. సాయంత్రం 4.20 గంటలకు ఎమ్మెల్యే కె. లలితకుమారి నివాసానికి వెళ్లనున్నారు. అనంతరం విశాఖలో జరుగుతోన్న బ్రిక్స్ సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం 5.05 గంటలకు నోవాటెల్‌లో జరిగే రెండో బ్రిక్స్ యువజన, క్రీడల మంత్రుల సమావేశాలు--2026లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. విశాఖ పర్యటన ముగించుకుని రాత్రికి అమరావతి చేరుకోనున్నారు.

# ఎంపీపీ రిజర్వేషన్లలో కీలక మార్పు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించిన డెడికేటెడ్ కమిషన్ నివేదికలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్ర నేతృత్వంలోని కమిషన్ గతంలో ఎంపీపీ పదవుల రిజర్వేషన్లను జిల్లా యూనిట్ ప్రాతిపదికన నిర్ణయించగా, తాజా సిఫార్సుల మేరకు రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించి రిజర్వేషన్లను పునఃలెక్కించింది.

జిల్లా యూనిట్ విధానం అమల్లో ఉన్నప్పుడు కొన్ని జిల్లాల్లో బీసీలకు కేవలం 5 శాతం మేర మాత్రమే ఎంపీపీ రిజర్వేషన్లు లభించే పరిస్థితి ఉండేది. రాష్ట్రవ్యాప్తంగా బీసీ జనాభా నిష్పత్తిని ఆధారంగా తీసుకోవడంతో ఆ వాటా సుమారు 9 శాతానికి పెరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మార్పు వల్ల జిల్లాల మధ్య రిజర్వేషన్లలో ఉన్న అసమానతలు తగ్గనున్నాయి.

రాష్ట్ర స్థాయిలో బీసీలకు కల్పిస్తున్న మొత్తం రిజర్వేషన్ శాతంలో మాత్రం ఎలాంటి మార్పు ఉండదని సమాచారం. కమిషన్ ప్రతిపాదనల ప్రకారం రాష్ట్రంలోని 661 మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) పదవుల్లో 152 స్థానాలు బీసీలకు రిజర్వ్ కానున్నాయి. ఈ సవరణలను ప్రభుత్వం తుది రిజర్వేషన్ ప్రక్రియలో అమలు చేయనుంది.

# పంచాయతీల్లో బీసీలకు 34% రిజర్వేషన్!

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లలో జరిగే ఎన్నికల్లో బీసీలకు గతంలో ఉన్న రిజర్వేషన్ శాతం తిరిగి అమల్లోకి రానుంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ జీవో వెలువడింది. పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 33.33 శాతం, పంచాయతీరాజ్ సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించగా, ఇప్పుడు పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ రిజర్వేషన్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులకు వర్తించనుంది. గత ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్‌ను 24.14 శాతానికి తగ్గించగా, తాజా నిర్ణయంతో మళ్లీ 34 శాతానికి పునరుద్ధరించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాల ప్రకారం పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహిస్తేనే కేంద్ర నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్నందున, రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం వేగవంతం చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# 629 పోస్టులకు 1.05 లక్షల పోటీ!



(మొదటి పేజీ తరువాయి)


కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి తెలిపారు. ఈ పోస్టులకు 1.05 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, పరీక్షలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

పరీక్షలు ప్రతిరోజూ రెండు విడతల్లో జరుగుతాయని తెలిపారు. తొలి విడత ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదో ఒక ఫొటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ముఖ గుర్తింపు ధ్రువీకరణతో పాటు మెటల్ డిటెక్టర్ల ద్వారా భద్రతా తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, కాగితాలు పరీక్షా కేంద్రాల్లో అనుమతించబోమని స్పష్టం చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ దళారులు చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, విద్యుత్ సంస్థలు విడుదల చేసే అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని అభ్యర్థులకు సూచించారు.

# పట్టణాలకు 'మెగా' రూపురేఖలు!



(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టులో రూ.5,500 కోట్లు నిర్మాణ పనులకు, రూ.1,969.46 కోట్లు పదేళ్ల నిర్వహణ చెల్లింపులకు కేటాయించారు. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 4,388 కిలోమీటర్ల రోడ్లు, 541 పార్కులు, 1,186 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 20,340 వీధిదీపాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం నిధులను ప్రభుత్వం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ఆదాయాల ద్వారా ముందుగానే విడుదల చేయగా, మిగిలిన 60 శాతం వ్యయాన్ని గుత్తేదారు సంస్థ భరించి, పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యత కూడా చేపడుతుంది.

పట్టణాల్లో మౌలిక వసతుల లోటుపై శాస్త్రీయ అధ్యయనం నిర్వహించిన అనంతరం ఈ ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే అమృత్--2.0, ఆసియా మౌలిక వసతుల పెట్టుబడి బ్యాంకు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి పథకాల కింద రూ.15,274 కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. అభివృద్ధి పనులను విడివిడిగా కాకుండా రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి అన్ని వసతులను సమగ్రంగా ఒకేసారి అమలు చేయడమే ప్రభుత్వ విధానమని పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు.

పారిశుద్ధ్య రంగానికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోంది. చెత్త రహిత పట్టణాల లక్ష్యంతో 108 సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు వర్క్ ఆర్డర్లు జారీ చేయగా, ఇంటింటి చెత్త సేకరణ కోసం తొలి దశలో 1,153 ఎలక్ట్రిక్ ఆటోలను రంగంలోకి దించనుంది. మరోవైపు అమరావతి రాజధానిలో రూ.66,802 కోట్ల మౌలిక వసతుల పనులు మంజూరై, అందులో రూ.43,422 కోట్ల విలువైన పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# శరవేగంగా.. అమరావతి!




(మొదటి పేజీ తరువాయి)

ఆలయ పునఃశంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్న అనంతరం మంత్రి ఈ వివరాలు వెల్లడించారు.

మంత్రి మాట్లాడుతూ తుళ్లూరు రైతులు ల్యాండ్ పూలింగ్‌కు అపూర్వ సహకారం అందించారని గుర్తు చేశారు. తాను కూడా రాజధాని రైతుల కుటుంబంలో ఒకడిగా భూములు పూలింగ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం రిటర్నబుల్ ప్లాట్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించే కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

అమరావతి మౌలిక వసతుల అభివృద్ధిలో స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే ట్రాక్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. మరో 15 రోజుల్లో సీడ్ యాక్సెస్ రోడ్డును జాతీయ రహదారికి అనుసంధానించే ఎలివేటెడ్ కారిడార్ మూడో దశ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అనంతరం విమానాశ్రయ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, అమరావతి నిర్మాణ ప్రాంగణాల్లో పగలు-రాత్రి తేడా లేకుండా పనులు కొనసాగుతున్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో భారీ క్రేన్ల సాయంతో జీఏడీ టవర్, హెచ్‌వోడీ టవర్లు సహా ఐకానిక్ భవనాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. సెక్రటేరియట్ టవర్లలో అత్యాధునిక డయాగ్రిడ్ సాంకేతికతతో డైమండ్ ఆకృతుల నిర్మాణం చేపడుతుండగా, ఒక్కో డైమండ్ ఆధారంగా ఆరు అంతస్తుల చొప్పున నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువుల్లో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి.

# మంత్రి సత్యకుమార్ సంకల్పంతో ఆయుష్‌కు మహర్దశ



(మొదటి పేజీ తరువాయి)

**టెక్కలి నుంచి తిరుపతి వరకు.. ఆరు చోట్ల ఆయుష్ ఆసుపత్రులు** : జాతీయ ఆయుష్ మిషన్ కింద ఆరు ప్రాంతాల్లో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రులను నిర్మించనున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో రూ.9.98 కోట్లు, పోలవరం జిల్లా రంపచోడవరంలో రూ.10.57 కోట్లు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రూ.10.52 కోట్లు, గుంటూరు జిల్లా తెనాలిలో రూ.10.50 కోట్లు, మార్కాపురం జిల్లా గిద్దలూరులో రూ.10.58 కోట్లు, తిరుపతి జిల్లాలో రూ.9.99 కోట్ల అంచనా వ్యయంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు.


**ప్రొద్దుటూరులో యునాని.. ధర్మవరంలో ఆయుర్వేద కళాశాలలు** : కడప జిల్లా ప్రొద్దుటూరులో ప్రభుత్వ యునాని వైద్య కళాశాల ఏర్పాటుకు రూ.49 కోట్ల అంచనా వ్యయంతో, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఏర్పాటుకు రూ.49 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

**'విమ్స్'లో నేచురోపతి--యోగ కళాశాల.. ఆయుష్ ఆసుపత్రికి అదనపు వసతులు** : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ నేచురోపతి, యోగ కళాశాలకు ప్రస్తుతం ఉన్న గ్రౌండ్‌ఫ్లోర్‌పై మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.9.37 కోట్లు అంచనా వేశారు. అదే ప్రాంగణంలోని 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రిలో ప్రస్తుత రెండో అంతస్తుపై అదనపు నిర్మాణంతో పాటు కళాశాల క్లినికల్ విభాగానికి అవసరమైన సౌకర్యాల కోసం మూడో అంతస్తు నిర్మాణానికి రూ.3.04 కోట్లు కేటాయించారు.

**చింతూరు ఏరియా ఆసుపత్రి.. కాకినాడ జీజీహెచ్‌లో కొత్త ఓపీడీ బ్లాక్ నిర్మాణాలు** : చింతూరులోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా ఉన్నతీకరించేందుకు రూ.21.99 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. కాకినాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో కొత్త రోగుల ఓపీడీ భవనం నిర్మాణానికి రూ.27.13 కోట్ల అంచనా వ్యయాన్ని నిర్ణయించారు.

ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల ప్రక్రియ చేపట్టింది.

# డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ!




- **ఏళ్ల నిరీక్షణకు తెర.. కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారం**
- **క్రమబద్ధీకరణకు విశేష కృషి చేసిన ఎన్జీజీవో రాష్ట్ర నాయకత్వానికి సన్మానం**
- **ప్రభుత్వానికి కాంట్రాక్ట్ ఉద్యోగుల హృదయపూర్వక కృతజ్ఞతలు**
- **ఎన్జీజీవో రాష్ట్ర నాయకత్వానికి, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) ప్రక్రియ విజయవంతం కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసేందుకు అలుపెరగని కృషి చేసిన ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. విద్యాసాగర్‌ని, కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేశారు.

**కీలక పాత్ర పోషించిన 'సాగర్-రమణ' నాయకత్వం:** ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని ఎన్జీజీవో రాష్ట్ర నాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని కొనియాడారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో అధ్యక్షుడు విద్యాసాగర్ నిరంతరం శ్రమించారని తెలిపారు. వారి ప్రత్యేక చొరవతోనే ముఖ్యమంత్రి ఆమోదం, క్యాబినెట్ ఆమోదం లభించడమే కాకుండా, అసెంబ్లీలో బిల్లు పాస్ అయిందని గుర్తుచేశారు. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ ప్రాసెస్ చట్ట సవరణ (అమెండ్మెంట్) ద్వారా సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు మార్గం సుగమమైందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్జీజీవో సంఘం చొరవతో 8000 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషనుకు మార్గం ముఖ్యమంత్రి ఆమోదంతో సగం అయిందని, ఇప్పుడు యాక్ట్ 30 సవరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం లభించడంతో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్కు కూడా మార్గం సుగమం అయిందని తెలిపారు.

**ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు:** ఏళ్ల తరబడి వేచి చూస్తున్న ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కుటుంబాలకు భరోసా కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, శాఖాధికారులకు మరియు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగానికి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు సమర్పించారు.

ఈ కృతజ్ఞతా కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరెడ్ల అంజనీ కుమార్, కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి భారీ సంఖ్యలో విచ్చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఎన్జీవో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బడి మారింది.. బొమ్మరిల్లు అయింది!



(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఏడాది భారీగా డిమాండ్ పెరుగుతోంది. ఈ విద్యా సంవత్సరంలోనే కొత్తగా 400 మంది విద్యార్థులు చేరడం విశేషం. పాఠశాలలో 62 తరగతి గదులను ఇంటరాక్టివ్ డిజిటల్ ప్యానెళ్లతో సన్నద్ధం చేయడంతో పాటు అత్యాధునిక గ్రంథాలయం, సైన్స్-కంప్యూటర్ ప్రయోగశాలలు, ఏఐ--రోబోటిక్స్ ల్యాబ్, కోడింగ్, స్టెమ్ టూల్స్, సెన్సర్లపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, భగవద్గీత పోటీలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, నేవీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థులను బహుముఖ ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దుతున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన క్రీడా మైదానం, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధనతో ఈ ప్రభుత్వ పాఠశాల ఇప్పుడు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా నిలుస్తోంది. ఇప్పటివరకు 27 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించగా, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసాన్ని పెంచిన విజయగాథగా చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ నిలిచిందని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

# భోగాపురానికి అరగంటకో 'ఈ-బస్సు'



(మొదటి పేజీ తరువాయి)

అనంతరం విమానాశ్రయంలోని ప్రయాణికులతో మంత్రి మాట్లాడి, విశాఖపట్నం-భోగాపురం మధ్య ఆర్టీసీ కల్పించిన రవాణా సదుపాయాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. విమానాల సమయాలకు అనుగుణంగా బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు.

ప్రయాణికులకు సురక్షితమైన, పర్యావరణహితమైన రవాణా అందించడమే లక్ష్యంగా ఎలక్ట్రిక్ బస్సు సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

# తిరుమలలో ఈసారి రెండు బ్రహ్మోత్సవాలు!



(మొదటి పేజీ తరువాయి)

సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు, నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20 వరకు జరుగనున్నాయి. సెప్టెంబర్ 14న సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానుండగా, మరుసటి రోజు ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహన సేవతో ప్రధాన ఉత్సవాలు ఆరంభమవుతాయి. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు నిర్వహించనున్నారు.

సెప్టెంబర్ 19న గరుడ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

సెప్టెంబర్ 15న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బ్రహ్మోత్సవాలను ప్రారంభించడంతో పాటు తిరుమలలో విద్యుత్ బస్సు సేవలను కూడా ప్రారంభించనున్నట్లు అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే మూలవిరాట్ దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య 8 శాతం పెరిగిందని, భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు దర్శన, రవాణా, పారిశుద్ధ్య, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తిరుపతిలోని అన్ని ఆలయాలు, అలిపిరి నడక మార్గాలు, రైల్వే, బస్టేషన్ల వద్ద సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పెరటాసి మాసం సందర్భంగా తమిళనాడు నుంచి నడక మార్గంలో వచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ట్రాఫిక్, భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తామని, గత ఏడాదికంటే అధిక సంఖ్యలో పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామని వెల్లడించారు.

# షావుకారు జానకి మృతి పట్ల బీజేపీ మాధవ్ సంతాపం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : అలనాటి ప్రముఖ నటి షావుకారు జానకి (94) ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

400కు పైగా చిత్రాల్లో నటించి, తన విలక్షణ నటనతో ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న షావుకారు జానకి ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారని తెలిపారు. ఆమె పోషించిన విభిన్న పాత్రలు తెలుగు చలనచిత్ర రంగంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. షావుకారు జానకి భౌతికంగా మనకు దూరమైనప్పటికీ, ఆమె నటించిన పాత్రల ద్వారా ఎప్పటికీ ప్రజల మనసుల్లో జీవించే ఉంటారని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఆమె ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## 'ఇంటింటికీ తెలుగుదేశం-2026'



- **74.30 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు**
- **నేడు 2,50,129 ఇళ్లను సందర్శించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు**
- **ప్రజా భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా కొనసాగుతున్న 'ఇంటింటికీ తెలుగుదేశం'**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు.. ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 26వ రోజూ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. 26వ రోజు రాష్ట్రవ్యాప్తంగా 2,50,129 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 74.30 లక్షల ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించారు. ప్రతీ గడపకు వెళ్ళి ప్రతీ కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలిసి వారికి అందుతున్న ప్రయోజనాలను వివరించడంతో పాటు రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్య తరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను ఆయా కుటుంబాలకు వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా భాగస్వామ్యమవుతున్నారు.

## మత్స్యకారుల ఆచూకీ కోసం కొనసాగుతున్న ముమ్మర గాలింపు



- **5 నౌకలు, 2 డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్‌తో విస్తృత సెర్చ్ ఆపరేషన్**
- **మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్, బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంత అధికారులకు సమాచారం**
- **మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చే వరకు గాలింపు ఆగదు**
- **కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి(జర్నలిస్ట్ పైల్)** : గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం చేపట్టిన గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌తో సంబంధిత అధికారులు మాట్లాడి సెర్చ్ ఆపరేషన్ పురోగతిని తెలుసుకున్నారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 5 నౌకలు, రెండు డోర్నియర్ విమానాలు, ఒక హెలికాప్టర్‌తో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు తెలియజేశారన్నారు. మత్స్యకారుల బోటుకు సంబంధించిన సమాచారాన్ని మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్‌తోపాటు బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంతాల్లోని కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా చేరవేశారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనూ బోటు ఆచూకీ కోసం అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బోటు ఆచూకీ లభించనప్పటికీ, సెర్చ్ ఆపరేషన్‌లో ఎలాంటి విరామం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ తరువాత బాధ్యతలు స్వీకరించే అధికారి కూడా గాలింపు చర్యలను కొనసాగిస్తారని కోస్ట్‌గార్డ్ అధికారులు తెలిపినట్లు వెల్లడించారు. మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కోస్ట్‌గార్డ్, నేవీతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని చెప్పారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, బోటు ఆచూకీ లభించే వరకు అన్ని మార్గాల్లో గాలింపు కొనసాగిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

## భక్తి శోభతో తొలిసారి శ్రీ వరలక్ష్మీ వ్రతం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం కళ్యాణ మండపంలో శ్రీ వరలక్ష్మీ వ్రత పూజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మఠం కళ్యాణ మండపంలో మొట్టమొదటిసారిగా ఈ పూజలు జరగడం విశేషం. శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారి దంపతులు మరియు దత్తాత్రేయ స్వామి దంపతుల చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. మండపం మొత్తం మామిడి తోరణాలతో, పూలతో అలంకరించబడింది. పూజలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సుమంగళులు వరలక్ష్మీ వ్రతం ఆచరించి కుటుంబ సౌఖ్యం, సిరిసంపదల కోసం ప్రార్థనలు చేశారు. పూజ అనంతరం మఠాధిపతులు భక్తులకు ఆశీర్వచనం అందించారు. కార్యక్రమం అంతా భక్తి వాతావరణం నెలకొంది. అక్కడికి వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

# డిగ్రీలున్న యువతలో ఉద్యోగ నైపుణ్యాల కొరత



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ పైల్)** : దేశంలో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్నా.. ఆ చదువు యువతకు నాణ్యమైన ఉపాధిగా మారడం లేదు. డిగ్రీలు చేతిలో ఉన్నా.. ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలు లేక యువత ఇబ్బందులు పడుతోంది. దేశ విద్యా వ్యవస్థ, నైపుణ్య శిక్షణ, ఉద్యోగ మార్కెట్ మధ్య తీవ్ర అనుసంధాన లోపం ఉందని 'నీతి ఆయోగ్' తాజా నివేదిక స్పష్టం చేసింది. 'రీఇమేజినింగ్ స్కిల్లింగ్ ఫర్ వికసిత్ భారత్ 2047' పేరుతో ఆగస్టు 18న విడుదల చేసిన నివేదికలో విద్య--ఉపాధి మధ్య ఉన్న అంతరాలను వివరించింది. ఇది కేవలం నిరుద్యోగ సమస్య కాదని.. ఏండ్ల తరబడి చదివి డిగ్రీలు సంపాదించిన యువత కూడా ఉద్యోగానికి అవసరమైన ప్రాక్టికల్ నైపుణ్యాల కొరతతో సతమతమవుతున్నట్లు పేర్కొంది.

**డిగ్రీ ఉంది.. స్కిల్స్ ఎక్కడ?** 2024-25 ఆర్థిక సర్వేలోని విద్య-ఉద్యోగ నైపుణ్యాల గణాంకాలను నీతి ఆయోగ్ ప్రస్తావించింది. గ్రాడ్యుయేట్ స్థాయి విద్య ఉన్న వారిలో కేవలం 8.25 శాతం మంది మాత్రమే అధిక నైపుణ్యాలు అవసరమైన ఉద్యోగాల్లో ఉన్నట్లు వెల్లడించింది. మరో 38.23 శాతం మంది ప్రత్యేక నైపుణ్య ఉద్యోగాల్లో ఉండగా, 50.3 శాతం మంది సెమీ-స్కిల్డ్ ఉద్యోగాల్లో పనిచేస్తున్నారు. అంటే ఉన్నత విద్య పూర్తిచేసిన వారిలో గణనీయమైన సంఖ్యలో యువత తమ చదువుకు తగ్గ నైపుణ్యాలను ఉపయోగించుకునే ఉద్యోగాల్లోకి వెళ్లలేకపోతోందని నివేదిక విశ్లేషించింది.

**బీఏ, బీకాం, బీఎస్సీ.. ఆ తర్వాత?** దేశంలోని ఉన్నత విద్యలో సాధారణ డిగ్రీ కోర్సుల వాటా భారీగా ఉంది. సుమారు 3.4 కోట్ల మంది అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థుల్లో 1.13 కోట్ల మంది ఒక్క బీఏలోనే చదువుతున్నారు. బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో కలిపి 2 కోట్ల మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. అయితే ఈ కోర్సుల్లో అనేక వాటికి ఉద్యోగ మార్కెట్‌తో బలమైన అనుసంధానం లేదని నీతి ఆయోగ్ పేర్కొంది.

సాధారణ డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగంలోకి వెళ్లేందుకు అవసరమైన స్పష్టమైన మార్గం చాలా సందర్భాల్లో కనిపించడం లేదని నివేదిక తెలిపింది. ఉద్యోగ మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే డిజిటల్ స్కిల్స్, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యం వంటి అదనపు నైపుణ్యాలు కూడా అవసరమవుతున్నాయి.

**వేల కోట్ల ఖర్చు.. ఫలితాలు అంతంతే!** 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది. అయితే ఆ లక్ష్యానికి కీలకమైన యువత విద్య, నైపుణ్యాలు, ఉపాధి మధ్య సంబంధం ఇప్పటికీ బలహీనంగానే ఉందని ప్రభుత్వ విధాన సంస్థే వెల్లడించడం గమనార్హం. 2014-15 నుంచి 7.67 కోట్ల మందికిపైగా యువతకు నైపుణ్య శిక్షణ అందించినట్లు నివేదిక పేర్కొంది. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా నైపుణ్యాభివృద్ధికి రూ.34 వేల కోట్ల కేటాయింపులు జరిగాయి. అయినప్పటికీ శిక్షణ పొందిన యువతకు ఉద్యోగాలు, మెరుగైన వేతనాలు, కెరీర్ పురోగతి వంటి ఫలితాలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదన్న అంశం నివేదికలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది.

**ప్రాక్టికల్ అనుభవమే కరువు** : డిగ్రీ చదివే సమయంలో పరిశ్రమలతో పరిచయం, ఆచరణాత్మక శిక్షణ కొరవడటం మరో ప్రధాన సమస్యగా నీతి ఆయోగ్ గుర్తించింది. పుస్తకాలకే పరిమితమైన విద్య కారణంగా విద్యార్థులు ఉద్యోగ మార్కెట్‌లోకి అడుగుపెట్టే సమయానికి వాస్తవ పని అనుభవం లేక వెనుకబడుతున్నారు.

ఈ లోటును ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు భర్తీ చేయగలవని నివేదిక సూచించింది. అయితే అవి కేవలం సర్టిఫికెట్లకే పరిమితం కాకుండా.. వాస్తవ పని, నైపుణ్య శిక్షణ, పరిశ్రమల అనుభవాన్ని అందించేలా ఉండాలని స్పష్టం చేసింది.

**ప్రభుత్వ ఉద్యోగాల వైపే పరుగులు** : చదివిన చదువుకు తగ్గ ప్రయివేటు ఉద్యోగ అవకాశాలు స్పష్టంగా కనిపించకపోవడం, ఉద్యోగ భద్రతపై ఆందోళన, స్థిరమైన ఆదాయంపై ఆశ.. ఇవన్నీ యువతను ప్రభుత్వ ఉద్యోగాల వైపు మళ్లిస్తున్నాయి. నీతి ఆయోగ్ నివేదికలో ప్రస్తావించిన వివరాల ప్రకారం నవంబర్ 2024 నుంచి జులై 2025 మధ్య కేవలం 55 వేల ప్రభుత్వ పోస్టులకు 1.86 కోట్ల దరఖాస్తులు వచ్చాయి.

ఇది కేవలం పోటీ పరీక్షలపై యువతకు ఉన్న ఆసక్తిని మాత్రమే కాకుండా.. చదువు పూర్తయిన తర్వాత స్థిరమైన, గౌరవప్రదమైన జీవనోపాధి కోసం వారు ఎదుర్కొంటున్న అస్థిరతను కూడా ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**నినాదాలు చాలవు.. ఫలితాలివ్వాలి!** గత దశాబ్ద కాలంలో కేంద్ర ప్రభుత్వం 'స్కిల్ ఇండియా', 'మేకిన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా', 'వికసిత్ భారత్' వంటి పథకాలు, కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసింది. కానీ డిగ్రీ పూర్తిచేసిన యువతకు వారి చదువుకు తగ్గ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇంకా పెద్ద సవాలే ఉందని తాజా నివేదిక సూచిస్తోంది. విద్యార్థులు చదువుతున్నప్పుడే పరిశ్రమలతో అనుసంధానం కల్పించడం, ప్రాక్టికల్ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు, కెరీర్ గైడెన్స్ అందుబాటులోకి తేవాలని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు మారుతున్న ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా కోర్సులను రూపొందించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

పాఠశాల స్థాయి నుంచే ఉద్యోగ, వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడం, విద్యను పరిశ్రమల అవసరాలతో అనుసంధానించడం, అప్రెంటిస్‌షిప్‌లను విస్తరించడం, నైపుణ్య ఆధారిత నియామకాలను ప్రోత్సహించడం వంటి చర్యలు అవసరమని నీతి ఆయోగ్ సూచించింది. శిక్షణ కార్యక్రమాల విజయాన్ని కేవలం ఎంతమందికి శిక్షణ ఇచ్చామన్న లెక్కలతో కాకుండా.. ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయి, వేతనాలు ఎంత పెరిగాయి వంటి ఫలితాల ఆధారంగా అంచనా వేయాలని పేర్కొంది.

చేతిలో డిగ్రీ ఉండటం మాత్రమే యువత భవిష్యత్తుకు భరోసా కాదని.. ఆ డిగ్రీకి ఉద్యోగ మార్కెట్‌లో విలువ తెచ్చే నైపుణ్యాలు కూడా అవసరమని నీతి ఆయోగ్ తాజా నివేదిక తేల్చిచెబుతోంది. స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలు నినాదాలకే పరిమితం కాకుండా యువతకు నిజమైన ఉపాధి అవకాశాలుగా మారినప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాకారమవుతుందన్నది స్పష్టమవుతోంది.

## పెద్దల సభ ఔన్నత్యాన్ని కాపాడేలా వైసీపీ వ్యవహరించాలి

- **ఎమ్మెల్సీ వర్ల రామయ్య**



**మంగళగిరి(జర్నలిస్ట్ పైల్)** :శాసన మండలిలో తన తొలి రోజు అనుభవం తీవ్ర నిరాశకు గురిచేసిందని ఎమ్మెల్సీ వర్ల రామయ్య అన్నారు. పెద్దల సభలో చర్చలు, సమీక్షలు, బిల్లులపై నిర్మాణాత్మక సూచనలు జరగాల్సి ఉండగా, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు నినాదాలు, ప్లకార్డులు, గందరగోళంతో సభా గౌరవాన్ని దిగజార్చారని ఆయన ఆరోపించారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆమోదించిన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపిన వర్ల రామయ్య, ప్రమాణ స్వీకారం అనంతరం సభలో చర్చలకు సిద్ధమై వెళ్లానని చెప్పారు. అయితే సభలో చైర్మన్ మోషెన్ రాజు ఎదుట వైసీపీ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ కార్యకలాపాలకు అంతరాయం కలిగించారని విమర్శించారు. పెద్దరికం వయసుతో కాకుండా నడవడి, సంస్కారంతో వస్తుందని, శాసన మండలి సభ్యులు రాజ్యాంగ బాధ్యతలను గుర్తుంచుకోవాలని సూచించారు. మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను కూడా వర్ల రామయ్య ఖండించారు. డీఎస్సీ నియామకాల్లో అవినీతి జరిగిందనే ఆరోపణలకు సంబంధించి అధికారులు ఇప్పటికే స్పష్టమైన వివరణ ఇచ్చారని, 341 పిటిషన్లను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో నిరాధార ప్రచారంతో నిరుద్యోగులు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ఆధారాలు ఉంటే కోర్టును ఆశ్రయించాలని, తప్పుడు ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శాసన మండలి దళిత చైర్మన్‌ను అవమానించే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి తగదని వర్ల రామయ్య అన్నారు. రాబోయే సమావేశాల్లో వైసీపీ ఎమ్మెల్సీలు సభ్యత, సంస్కారం పాటిస్తూ పెద్దల సభ గౌరవాన్ని నిలబెట్టాలని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా చర్చలకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. తన తొలి రోజు అనుభవం "పీడకల"గా మిగిలిందని, భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని ఆకాంక్షించారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత!

**తెనాలి, (జర్నలిస్ట్ ఫైల్ ):** పట్నంలోని 11ఖఌ లైన్ మరమ్మతులు మరియు లైనులకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించుటకు పనులు జరుగుతున్న క్రమంలో బుర్రిపాలెం రోడ్డు, నాజర్ పేట, గురువయ్య కాలనీల ప్రాంతంలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. అశోక్ కుమార్ కోరారు.

## షావుకారు జానకి కన్నుమూత



**చెన్నై (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ సినీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చెన్నైలోని కావేరీ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ఐసియులో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. 1931 డిసెంబర్ 12న రాజమహేంద్ర వరంలో జన్మించిన జానకి చిన్నతనంలోనే నాటకాల్లో నటించారు. 11 ఏళ్ల వయసులో రేడియో కార్యక్రమంలో పాల్గొన్నారు. 1949లో 'రక్షా రేఖ' సినిమాతో సినీరంగ ప్రవేశం చేశారు. 1950లో విజయా సంస్థ నిర్మించిన 'షావుకారు' చిత్రంతో గుర్తింపు పొందారు. ఆ సినిమా పేరే ఆమె ఇంటిపేరుగా మారింది. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 380కి పైగా చిత్రాల్లో నటించిన ఆమె మూడు హిందీ, ఒక మలయాళ చిత్రంలోనూ కనిపించారు. కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. 'వద్దంటే డబ్బు', 'కన్యాశుల్కం', 'పిచ్చి పుల్లయ్య', 'రేచుక్క - పగటిచుక్క', 'రోజులు మారాయి', 'సొంతవూరు', 'జయం మనదే', 'డాక్టర్ చక్రవర్తి', 'సంసారం ఒక చదరంగం', 'తోడికోడళ్లు', 'బాబు బంగారం', 'గీతాంజలి' తదితర చిత్రాలు ఆమె నట ప్రస్థానంలో గుర్తుండిపోయాయి. చివరిసారిగా 2023లో 'అన్నీ మంచి శకునములే' చిత్రంలో నటించారు. సినీరంగానికి ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

**ప్రముఖుల సంతాపం** : జానకి మృతి పట్ల తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. విశిష్టమైన నటనతో తరతరాల ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న జానకి మరణ వార్తతో తాను తీవ్ర దిగ్భ్రాంతికి, దుఃఖానికి లోనయ్యానని తమిళనాడు ముఖ్యమంత్రి సి జోసెఫ్ విజయ్ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమలో 70 సంవత్సరాలకు పైగా కొనసాగి, లెక్కలేనన్ని పాత్రలకు జీవం పోసిన ఆమె కళాత్మక సేవలు చిరస్మరణీయమన్నారు.

షావుకారు జానకి మరణం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 400కు పైగా చిత్రాల్లో నటించి ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన షావుకారు జానకి భౌతికంగా మనకు దూరమైనా ఆమె నటించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా మన మనసుల్లో నిలిచిపోతారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సంతాపాన్ని ప్రకటిస్తూ.. సినిమా పేరునే ఇంటిపేరుగా మార్చుకున్న ఆమె కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రలు పోషించారని గుర్తుచేసుకున్నారు. మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ తదితరులు సంతాపం తెలిపారు. జానకి కన్నుమూతపై మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వైయస్ జగన్ సంతాపం వ్యక్తం చేశారు. సినీ ప్రేక్షకుల హృదయాల్లో షావుకారు జానకి చెరగని ముద్ర వేశారని ఆయన కొనియాడారు.

## కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి మహర్దశ

- **త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి**
- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
- **వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
- **ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**



**కోటబొమ్మాళి (జర్నలిస్ట్ పైల్)** : కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాబార్డు నిధులు రూ.2.90 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగం భవనాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ మౌలిక వసతులను బలోపేతం చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

**సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి** : ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రసూతి, శిశు ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు చేరువ చేయాలని అన్నారు.

**మానవతా దృక్పథంతో సేవలందించాలి** : వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించి రోగులకు ఆప్యాయతతో సేవలందించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సంతృప్తికరమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని కోరారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. రోగులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. విజయలక్ష్మి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీలక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు పి. గణేష్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏఈ నూకరాజు కుటుంబ ఆత్మహత్య కేసు దర్యాప్తు ముమ్మరం

- **సాదిక్ కోసం 10 ప్రత్యేక బృందాల గాలింపు**
- **వీలునామా, కాల్ డేటా, లేఖలపై లోతైన విచారణ**

**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ పైల్)** : తూర్పుగోదావరి జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ నూకరాజు కుటుంబం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనను పోలీసులు అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నారు. రైఫిల్ షూటింగ్ కోచ్ సాదిక్ ఖాన్ వేధింపులే ఈ దుర్ఘటనకు కారణమనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రతి ఆధారాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.

పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సాదిక్ కోసం రాజమహేంద్రవరంలో ఐదు, కాకినాడలో మూడు ప్రత్యేక బృందాలతో పాటు సాంకేతిక విశ్లేషణ కోసం మరో రెండు బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం పది బృందాలు అతని ఆచూకీ కోసం గాలిస్తున్నాయి. సాదిక్ విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్టును సీజ్ చేయడంతో పాటు లుకౌట్ సర్క్యులర్ కూడా జారీ చేశారు. అతని కాల్ రికార్డులు, ప్రయాణ వివరాలు, పరిచయాలపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు.

దర్యాప్తులో భాగంగా నూకరాజు ఆత్మహత్యకు ముందు రాసిన వీలునామా, మరణ వాంగ్మూలం కీలక ఆధారాలుగా మారాయి. తన స్థిర, చరాస్తులను సోదరితో పాటు మరో ఇద్దరి పేర్లపై రాసినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే నదిలో దూకే ముందు కుమార్తె సౌజన్య తన కుమారుడు కార్తికేయకు 'బతికి బయటపడితే ఓ ఆంటీ వద్దకు వెళ్లాలని' చెప్పిన విషయం కూడా విచారణలో కొత్త కోణాన్ని తెరపైకి తెచ్చింది. ఆ మహిళ ఫోన్ ప్రస్తుతం స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో ఆమె కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు. సౌజన్య రాసిన లేఖల్లో మతమార్పిడికి ఒత్తిడి, ఇస్లాం పుస్తకాలు చదవాలంటూ సాదిక్ వేధించాడని పేర్కొనడంతో ఆ ఆరోపణలపై కూడా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సాదిక్ కాల్ డేటా, నూకరాజు కుటుంబ సభ్యుల బ్యాంకు లావాదేవీలు, వీలునామా, లేఖలు తదితర ఆధారాలను సమగ్రంగా పరిశీలిస్తూ కేసు వెనుక ఉన్న పూర్తి వాస్తవాలను వెలికితీసే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది

## యువత రాజకీయ భాగస్వామ్యానికి రాజీవ్ గాంధీ కృషి చిరస్మరణీయం

- 18 ఏళ్లు నిండిన యువత ఓటరు నమోదుకు శ్రీకారం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం



**నల్గొండ, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి, దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నకిరేకల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..!

18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా దేశ రాజకీయాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించి, ఐటీ విప్లవానికి పునాదులు వేసిన దూరదృష్టి కలిగిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. దేశాభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన సంస్కరణలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల భారంలోకి నెడుతోందని ఎమ్మెల్యే విమర్శించారు. పేపర్ లీకేజీలు, నిరుద్యోగం, మత విద్వేషాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. యువత, పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, ఆయన ప్రధానమంత్రి అయితే ప్రజా సంక్షేమం, అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆకాంక్షించారు. రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఈ సందర్భంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళి..



**ఆత్మకూరు (ఎం) ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశాభివృద్ధికి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు మండల కేంద్రంలో బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ ఆధునీకరణలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. దేశంలో కంప్యూటర్ పరిజ్ఞానం, సమాచార సాంకేతికరంగం విస్తరణకు ఆయన చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప నాయకుడిగా రాజీవ్ గాంధీ చరిత్రలో నిలిచి పోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బెటర్ సిటీస్" ప్రచారానికి పోస్టర్ ఆవిష్కరణ



**నల్గొండ, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో "మేరా షహర్, మేరా హక్", "మెహనత్ కే హాత్" నినాదాలతో చేపట్టిన "దీప్‌వతీ జటఉవం" ప్రచారంలో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా "Better Cities" పోస్టర్‌ను ఆవిష్కరించారు. నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు గుమ్మల మోహన్ రెడ్డి, నల్లగొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ మామిడి కార్తీక్, నల్లగొండ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గాలి నాగరాజు, మండల అధ్యక్షుడు కె.వి.ఆర్. సతీష్, కంచర్ల ఆనంద్ రెడ్డి పట్టణ ఉపాధ్యక్షులు ముజ్జు తో పాటు పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముక్తకంఠంతో హత్యను ఖండించిన:టిఆర్ఎస్ఎంఎ



**భువనగిరి, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణంలోని మదర్ తెరిసా స్కూల్ నందు సాయంత్రం 11 ఆగస్టున చనిపోయిన రూపా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా TRSMA టిఆర్ఎస్ఎంఎ జిల్లా అధ్యక్షుడు పాలకూర వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ, నేటి సమాజంలో విద్యాబుద్ధులు నేర్పించి తల్లిదండ్రుల తర్వాత తల్లిలాగా జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి తప్పు ప్రవర్తన ఉన్నవారిని మందలించినందుకు ఆమెను అతి కిరాతకంగా చంపినందుకు సభ్య సమాజం తలదించుకోవాల్సిన అవసరం ఉంది. అసలు సమాజంలో ఉపాధ్యాయులకు రక్షణ లేకుంటే , దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే వాళ్ళు ఎవరు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గాదే సోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి వంగూరు పాండు, తుంగతుర్తి రంగారావు, దుర్గాప్రసాద్, చిన్నను సురేష్, తోటకూర యాదయ్య, రఘు అఖిలప్రియ కరస్పాండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడితో నష్టాలను తగ్గించుకోవచ్చు - తహసీల్దార్ స్రవంతి



**గరిడేపల్లి, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని గరిడేపల్లి తహసీల్దార్ స్రవంతి సూచించారు. గురువారం గరిడేపల్లి మండలం పరెడ్డిగూడెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పంట మార్పిడి అవగాహన కార్యక్రమంలో ఏఈఓ శిరీషతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేస్తున్న బీర, దోస, మిరప తదితర పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అధిక దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, సుస్థిర నీటి వినియోగం, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ స్రవంతి మాట్లాడుతూ.. రానున్న సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో అధిక ఉష్ణోగ్రతలతో పాటు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందుగానే వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రతిసారీ ఒకే పంటపై ఆధారపడకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. ఏఈఓ శిరీష మాట్లాడుతూ.. తక్కువ నీటితో సాగు చేయగల ఉద్యానవన పంటలు, కూరగాయలు, పెసర్లు, మినుములు, జొన్నలు వంటి ప్రత్యామ్నాయ పంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. విత్తన ఎంపిక నుంచి దిగుబడి వరకు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే లాభదాయకమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులకు క్షేత్రస్థాయిలోనే వ్యవసాయ శాఖ ద్వారా ఉచిత సలహాలు, సూచనలు అందిస్తున్నామని, అధికారులు సూచించిన సాగు పద్ధతులను రైతులు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరెడ్డిగూడెం సర్పంచ్ కేతేపల్లి నరసయ్య, ఉప సర్పంచ్ మేకల మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రేణుక, ఫీల్డ్ అసిస్టెంట్ బొబ్బ వెంకటరెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రహదారులు.. సాగునీరు.. సంక్షేమమే ప్రాధాన్యం

- హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఉత్తమ్ సుడిగాలి పర్యటన
- ప్రాజెక్టుల పురోగతిపై ఆరా..
- రైతుల సాగునీటి కల నెరవేర్చడమే లక్ష్యం..
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి..



**హుజూర్‌నగర్, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** హుజూర్‌నగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం నియోజకవర్గంలో మంత్రి సుడిగాలి పర్యటన నిర్వహించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు కోట్లాది రూపాయలతో చేపట్ట నున్న రహదారి పనులకు శంకుస్థా పనలు, నూతన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు నిర్వహించారు.



**సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి**

చింతలపాలెం మండలం పాత వెల్లటూరులో రూ.1,600 కోట్ల అంచనా వ్యయంతో 54 వేల ఎకరా లకు సాగునీరు అందించనున్న మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం పనులను మంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్ కార్యాచరణపై అధికా రులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దొండపాడు వద్ద రూ.394 కోట్లతో 14,100 ఎకరాలకు సాగునీరు అందించనున్న రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని కూడా మంత్రి పరిశీలించారు. సాగునీటి ప్రాజెక్టు లను పూర్తి చేసి నియోజకవర్గ రైతాంగానికి శాశ్వత ప్రయోజనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు**

అడ్లూరు గ్రామంలో రూ.23 కోట్లతో మేళ్లచెరువు నుంచి చింతి ర్యాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. మఠంపల్లి మండలం అల్లీపురంలో రూ.12 కోట్లతో అమరవరం నుంచి కొత్తతండా వరకు డబుల్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఎల్లాపురంలో రూ.18 కోట్లతో గుడుగుంట్లపాలెం నుంచి ఎల్లాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గడ్డిపల్లి నుంచి కోనాయి గూడెం మీదుగా బొలిశెట్టివారిగూడెం వరకు రూ.7.10 కోట్లతో చేపట్టనున్న రహదారి పనులకు శంకుస్థాపన కార్యక్రమం చివరి నిమిషంలో రద్దయింది.

**ప్రభుత్వ భవనాల ప్రారంభం:** రేబల్లెలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా శక్తి భవనాలను మంత్రి ప్రారంభించారు. కొత్తగూడెం, గాంధీనగర్ తండాల్లో రూ.20 లక్షల చొప్పున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. పాలకవీడులో రూ.1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని కూడా ప్రారంభించారు.

**ప్రజా సంక్షేమానికి భరోసా**

పర్యటనలో భాగంగా హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి ఉత్తమ్‌అందజేశారు. నియోజక వర్గంలో సాగునీరు, రహదారులు, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మహిళాసాధికారతకు సంబంధించిన పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

ఒకే రోజు పలు మండలాల్లో విస్తృతంగా పర్యటించిన మంత్రి సాగునీటి ప్రాజెక్టుల పనులను పరిశీలించడం, కోట్లాది రూపాయల రహదారి పనులకు శంకుస్థాపనలు చేయడం, ప్రభుత్వ భవనాలను ప్రారంభించడం ద్వారా నియోజక వర్గ అభివృద్ధిపై తనకున్న ప్రత్యేక దృష్టిని చాటుకున్నారు. సమయాభావం కారణంగా కొన్ని కార్యక్రమాలను అధికార యంత్రాంగం రద్దు చేశారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలే దేశాభివృద్ధికి మార్గదర్శకం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- మూటకొండూరులో రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ..
- ముందుగా అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు
- డోలు వాయిస్తూ.. డప్పులు కొడుతూ కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపిన ప్రభుత్వ విప్
- డప్పు చప్పుళ్లు, కోలాటాలతో ప్రభుత్వ విప్‌కు ఘన స్వాగతం..
- భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు





**ఆలేరు, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా మూటకొండూరు మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మండల కేంద్రానికి చేరుకోగానే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాలు, కోలాటం ఆటలు, జై కాంగ్రెస్ – జై రాజీవ్ గాంధీ నినాదాలతో అపూర్వ స్వాగతం పలికారు. మండల కేంద్రం మొత్తం కాంగ్రెస్ పార్టీ జెండాలు, బ్యానర్లు, రాజీవ్ గాంధీ చిత్రపటాలతో కళకళ లాడింది. కార్యకర్తల సందడి, ప్రజల విశేష భాగస్వామ్యంతో కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. ముందుగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మూటకొండూరు మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం సామాజిక న్యాయానికి, ప్రజా స్వామ్య పరిరక్షణకు మార్గదర్శకమని కొని యా డారు. అనం తరం భారీ ర్యాలీగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజీవ్ గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఎంతో ఆప్యాయంగా మమేకమయ్యారు. కార్యకర్తల ఉత్సాహానికి తాను కూడా జతకలిసి స్వయంగా డోలు వాయిస్తూ, దప్పులు కొడుతూ సందడి చేశారు. కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తూ, కోలాటం ఆటలను ఆస్వాదిస్తూ వారిలో మరింత ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యే స్వయంగా కార్యకర్తలతో కలిసి సందడి చేయడంతో కార్యక్రమ ప్రాంగణం కేరింతలు, చప్పట్లతో మార్మోగిపోయింది. ఈ దృశ్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అక్కడికి వచ్చిన ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన సభలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ ఆశయాలే దేశాభివృద్ధికి మార్గదర్శకమని అన్నారు. భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించిన దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. సమాచార సాంకేతిక రంగ విస్తరణ, కంప్యూటరీకరణ, టెలికమ్యూనికేషన్ అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, గ్రామీణాభివృద్ధి, యువత సాధికారత కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేడు భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో అగ్రగామిగా ఎదగడానికి రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాలే పునాది అని తెలిపారు. ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాగా, మూటకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తన సొంత నిధులతో ఏర్పాటు చేయించి ఆవిష్కరించడం విశేషం. ప్రజా నాయకుడిగా రాజీవ్ గాంధీ సేవలు చిరస్థాయిగా నిలిచేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయించడం అభినందనీయమని స్థానిక ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నెం సంజీవరెడ్డి, గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఈరసారపు యాదగిరి, ఎల్లంల సంజీవరెడ్డి, నీలం పద్మ వెంకటస్వామి, మండల సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్, గంగాపురం మల్లేష్, బుగ్గ కొమురయ్య, పీఏసీఎస్ చైర్మన్ సుబ్రమణ్యం, పచ్చిమట్ల మధర్ గౌడ్, చీర శ్రీశైలం, కొంత మోహన్ రెడ్డి, ఉపసర్పంచ్ వంగాల నికిత మహేందర్, బోయిన ఝాన్సీ, కవిత, మదర్ డెయిరీ డైరెక్టర్ కల్లపెల్లి శ్రీశైలం, పీఏసీఎస్ డైరెక్టర్లు పుష్ప, వార్డు సభ్యులు జూకంటి మధుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, కాంగ్రెస్ శ్రేణుల ఉత్సాహం, ప్రజల విశేష స్పందనతో మూటకొండూరు మండల కేంద్రం సందడిగా మారింది.



# బ్యాంకర్లు జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి..

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.



**యాదాద్రి భువనగిరి ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** గురువారం రోజు మినీ మీటింగ్ హల్ లో జిల్లా కలెక్టర్ , లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆధ్వర్యంలో జిల్లా సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాన్ని నిర్వ హించారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ ప్రభుత్వ సంక్షేమ , అభివృద్ధి పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు పెండింగ్ దరఖాస్తు లను త్వరితగతిన పరిష్కరించాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో 2026 జూన్‌తో ముగిసిన త్రై మాసికానికి సంబంధించి జిల్లాలో బ్యాంకింగ్ రంగం సాధించిన ప్రగతి , వార్షిక రుణ ప్రణాళిక అమలు , ప్రాధాన్యతా రంగాలకు రుణాల పంపిణీ , వ్యవసాయం , ఎంఎస్ఎంఈ రంగాలు , ప్రభుత్వ పథకాల అమలు , మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు , సామాజిక భద్రతా పథకాల కవరేజీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి. వీరన్న జిల్లాలోని బ్యాంకింగ్ ప్రగతిని వివరించారు. జూన్ 2026 నాటికి జిల్లాలో 23 బ్యాంకులకు చెందిన 121 శాఖలు పని చేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం బ్యాంకింగ్ వ్యాపారం 15,416.55 కోట్లకు చేరిందని , ఇందులో 5,108.11 కోట్ల డిపాజిట్లు , 10,308.44 కోట్ల రుణాలు ఉన్నాయని వివరించారు. మార్చి 2026 తో పోలిస్తే మొత్తం బ్యాంకింగ్ వ్యాపారంలో 893.48 కోట్ల వృద్ధి నమో దైందని తెలిపారు. జూన్ 2026 నాటికి ప్రాధాన్యతా రంగ రుణాలు 6,645.80 కోట్లు కాగా , ఇవి మొత్తం రుణాల్లో 64.46 శాతంగా ఉన్నాయని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రై మాసికంలో వ్యవసాయ రంగానికి 1,170.02 కోట్లు , ఎంఎస్ఎంఈ రంగానికి 363.01 కోట్లు , మొత్తంగా ప్రాధాన్యతా రంగానికి 1,556.00 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ముద్ర యోజన కింద 3,218 మంది లబ్ధిదారులకు ? 77.39 కోట్ల రుణాలు వివిధ బ్యాంకుల ద్వారా మంజూరు చేసినట్లు వెల్లడించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ , ఎస్ఈఆర్పి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు 164.09 కోట్లు , ఎంఈపిఎంఏ ద్వారా 37.57 కోట్లు రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎస్ హెచ్ జి రుణాల ఎన్ పి ఏ శాతం 31.03.2026 నాటికి 1.64 శాతం ఉండగా, 11.08.2026 నాటికి 1.86 శాతానికి పెరిగిందని వివరించారు. అధిక ఎన్ పి ఏ ఉన్న మండలాలను గుర్తించి బ్యాంకులు , సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ప్రత్యేక రికవరీ చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ మహిళల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు , పెట్రోల్ పంపులు , మహిళా మిల్లెట్ యూనిట్లు , మండల సమైక్య బస్సులు వంటి వివిధ ఆదాయ , ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు బ్యాంకులు అవసరమైన రుణ సహకారం అందించి మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చి దిద్దాలని కోరారు. అదనపు కలెక్టర్ భాస్కర రావు మాట్లాడుతూ పిఎంఈజిపి , పిఎం విశ్వకర్మ , పిఎం స్వానిధి తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల లక్ష్యాలను బ్యాంకులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హత కలిగిన కేసులను మంజూరు చేయాలని , మంజూరైన రుణాలను సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో బ్యాంకులు , సంబంధిత ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపరచాలని సూచించారు. రైతులకు అవసరమైన సమయంలో కొత్త పంట రుణాలు అందించాలని అదనపు కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. అర్హులైన రైతులను గుర్తించి వారికి రుణ సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు కూడా తగిన రుణ సహకారం అందించాలని సూచించారు. గ్రామీణ శిక్షణ సంస్థల ద్వారా స్థానికంగా డిమాండ్ ఉన్న ఉపాధి , స్వయం ఉపాధి అవకాశాలకు అనుగుణంగా శిక్షణ కార్య క్రమాలను నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

శిక్షణ పొందిన యువతకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించి వారు స్వయం ఉపాధి పొందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు బ్యాంకు శాఖల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని అదనపు కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు పొందే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రిజర్వు బ్యాంకు వద్ద ఉన్న క్లెయిమ్ చేయని నిధులు , ప్రభుత్వ ఖాతాల్లో ఉన్న క్లెయిమ్ చేయని నిధులను సంబంధిత వ్యక్తులు , సంస్థలు , ప్రభుత్వ శాఖలు గుర్తించి క్లెయిమ్ చేసుకునేలా బ్యాంకులు , సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచిం చారు. అర్హులైన ఖాతాదారులకు వారి హక్కుగా ఉన్న నిధులు అందేలా అవసరమైన అవగాహన కల్పించి , క్లెయిమ్ ప్రక్రియను వేగ వంతం చేయాలని తెలిపారు. పిఎంజెజెబివై , పిఎంఎస్బివై , ఏపివై వంటి సామాజిక భద్రతా పథకాల కవరేజీని మరింత పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేకంగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. బ్యాంకు శాఖలు , బిజినెస్ కరస్పాండెంట్లు, సంబంధిత ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ప్రత్యేక అవగాహన కార్య క్రమాలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఈ పథకాల పరిధిలోకి తీసుకురావాలని కోరారు. జిల్లా అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని పేర్కొన్న అదనపు కలెక్టర్ , ప్రభుత్వ శాఖలు లబ్ధి దారులను గుర్తించి అర్హత కలిగిన దరఖాస్తులను బ్యాంకులకు పంపించడం, బ్యాంకులు వాటిని సకాలంలో పరిశీలించి రుణాలు మంజూరు చేయడం , రుణాల పంపిణీ అనంతరం సంబంధిత శాఖలు పర్యవేక్షించడం ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించవచ్చని తెలిపారు. ఈ సమావేశం లోస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృతిక , డిఆర్డిఓ నాగిరెడ్డి , జిల్లా పరిశ్రమల శాఖ జిఎం రవీందర్ , ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్యామ్ సుందర్ , వివిధ బ్యాంకుల ప్రతినిధులు , ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

- జిల్లాలో 1.25 లక్షల మంది అనామలీస్ ఓటర్లు
- మ్యాపింగ్ కాని 22 వేల మంది ఓటర్లు
- 594 పోలింగ్ బూత్‌లతో తుది సవరణకు చర్యలు
- జిల్లా ఎలక్టోరోల్ అబ్జర్వర్, కలెక్టర్





**గద్వాల, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేసి పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎలక్టోరోల్ అబ్జర్వర్ సురేంద్రమోహన్ అన్నారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి సురేంద్రమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు ఓటరుగా నమోదు కావడానికి ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా కాపీలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినందున, బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇది తన మొదటి పర్యటన అని పేర్కొన్న ఆయన, తదుపరి పర్యటనలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అప్పటిలోగా జిల్లా ఎన్నికల అధికారులు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ..**

జిల్లాలో సుమారు 1.25 లక్షల మంది ఓటర్లు అనామలీస్ జాబితాలో ఉన్నారని తెలిపారు. మ్యాపింగ్ జరగని ఓటర్లు సుమారు 22 వేల మంది ఉన్నారని, వీరందరికీ నోటీసులు అందజేయనున్నట్లు చెప్పారు. మండలాలు, మున్సిపాలిటీలలో ఏఈఆర్వోల ఆధ్వర్యంలో నిర్దేశిత తేదీల్లో సంబంధిత ఓటర్లకు నోటీసులు అందేలా టామ్‌టామ్ చేయించడంతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం అందిస్తామని తెలిపారు. సంబంధిత ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియ కూడా పూర్తయిందని, ప్రస్తుతం జిల్లాలో 594 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో తరచూ గూగుల్ మీట్‌లు, ఇతర సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తు న్నామని కలెక్టర్ వివరించారు.

అనంతరం పరిశీలకుడు మండలాలు, మున్సిపాలిటీల వారీగా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్‌తో కలిసి ఉద్యానవన, సహకారశాఖల ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరాటం

- ఎస్ఐఆర్-2పై బీఎల్‌ఏలకు శిక్షణ.. 84.48 శాతం ప్రక్రియ పూర్తి
- రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నూతన ఓటర్ల నమోదు
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**గద్వాల, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం గద్వాల నియోజకవర్గం SIR-2 బూత్ లెవెల్ ఏజెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని నూతన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. నియోజకవర్గంలో SIR ప్రక్రియ 84.48 శాతం పూర్తయిందని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఉన్న ఓట్లలో సుమారు 40 వేల ఓట్లు తొలగించబడినట్లు పేర్కొంటూ, వాటి తొలగింపునకు గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని బీఎల్‌ఏలకు సూచించారు. మరణించిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారు, ఓటు షిఫ్టింగ్ చేసుకున్న వారి వివరాలను పరిశీలించి అర్హులైన వారి ఓట్లను తిరిగి నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడికి ఓటు హక్కు కల్పించేలా నూతన ఓటర్ల నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని కోరారు. సెప్టెంబర్ 15 వరకు బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా గద్వాల పట్టణంలో ఓటర్ల వివరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, అర్హులైన వారి ఓట్లను నమోదు చేయించేలా కృషి చేయాలని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు.

**ఎస్ఐఆర్ ఇంచార్జ్‌లు మాట్లాడుతూ..**

రాజీవ్ గాంధీ హయాంలో 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించడంతో పాటు స్థానిక సంస్థల బలోపేతానికి 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఫారం-6, 7, 8 దరఖాస్తుల ప్రక్రియను ఏ విధంగా నిర్వహించాలనే అంశంపై బీఎల్‌ఏలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. తొలగించిన ఓట్లకు సంబంధించిన పూర్తి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ఓటర్లను తిరిగి నమోదు చేయించాలని సూచించారు. అలాగే కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయించి, రాబోయే ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, ఉమ్మడి జిల్లా అసెంబ్లీ ఎస్ఐఆర్ ఇంచార్జ్ సిద్దేశ్వర, గద్వాల ఎస్ఐఆర్ ఇంచార్జ్ శ్రీనివాస్ గౌడ్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీలు విజయ్, రాజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌ఏ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల గదుల్లో పుస్తకాల నిల్వ.. ఆరుబయట విద్యార్థుల చదువులు

- గోదాం లేక ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాసామగ్రి నిల్వ
- అధికారుల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం







**గద్వాల, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గద్వాల పట్టణంలోని మూడో వార్డు పీజేపీ కాలనీలో ఉన్న ప్రీ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాల తరగతి గదులను పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లు, ఇతర విద్యాసామగ్రి నిల్వ చేసేందుకు ఉపయోగిస్తుండటంతో విద్యార్థులు ఆరుబయట కూర్చొని చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గద్వాల పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అయ్యే పుస్తకాలు, యూనిఫామ్‌లు, ఇతర విద్యాసామగ్రిని నిల్వ చేసేందుకు ప్రత్యేక గోదాం లేకపోవడంతో పీజేపీ కాలనీలోని పాఠశాల తరగతి గదులనే స్టోరేజ్‌గా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించేందుకు అవకాశం లేకుండా పోయి, వారిని ఆరుబయట కూర్చోబెట్టి పాఠాలు చెప్పాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనానికి రంగులు వేసి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించినప్పటికీ, అదే పాఠశాల గదులను విద్యాసామగ్రి నిల్వ కేంద్రంగా మార్చడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలగకుండా పుస్తకాలు, యూనిఫామ్‌లు, ఇతర సామగ్రి నిల్వ చేసేందుకు ప్రత్యేక గోదాం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ఈ విషయంపై ఎంఈఓను వివరణ కోరగా, అధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యాసామగ్రిని నిల్వ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల తరగతులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

# మీ ఎదుగుదలలో అక్కగా, అమ్మలా తోడుంటా

- బాల్య వివాహాల నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం.
- జిల్లా ఎస్పీ డి సునీత రెడ్డి..




**మహబూబ్‌నగర్, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** మీ ఎదుగుదలకు అమ్మలా, అక్కగా తోడుంటానని బాల్య వివాహాల నుంచి విముక్తి పొందిన బాలికలకు జిల్లా ఎస్పీ డి సునీత రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాల్య వివాహాల నుంచి విముక్తి కలిగించిన బాలికలు వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ .. మూడు నెలలపాటు వారికి నచ్చిన నైపుణ్య వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇప్పించి జీవనోపాధి కల్పిస్తామని భరోసా కల్పించారు. బాల్య వివాహం ఆపడం అంటే కేవలం ఒక పెళ్లిని నిలిపేయడం కాదని, బాలిక చదువు, బాల్యాన్ని, ఆరోగ్యాన్ని, కలలను, భవిష్యత్తును కాపాడటమని ఎస్పీ పేర్కొన్నారు. వనపర్తి జిల్లాను బాల్యవివాహాల నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని కొనియాడారు. అనంతరం బాల్య వివాహ నిర్మూలన పోస్టర్ ను ఆవిష్కరించారు

**భావోద్వేగమైన క్షణాలు**



బాల్య వివాహాల నుంచి విముక్తి పొందిన కొందరు బాలికలు తమ అనుభవాలను పంచుకున్నారు. తమ పెళ్లి ఆపిన సమయంలో కుటుంబ సభ్యులు బాధపడ్డారని, ఆ సమయంలో పరిస్థితిని అర్థం చేసుకోలేకపోయామని .. కానీ ఇప్పుడు బాల్య వివాహం జరిగి ఉంటే తమ జీవితాలు ఎలా ఉండేవో తెలుసుకున్నామని భావోద్వేగంతో తెలిపారు. వారి మాటల్లోని ఆవేదన, నేటి పరిస్థితిపై ఉన్న అవగాహన, భవిష్యత్తుపై కనిపించిన ఆశ సమావేశంలో ఉన్న ప్రతి ఒక్కరినీ కదిలించాయి. పలువురు బాలికలు భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమైన సమయంలో.. మీరు ఒంటరిగా లేరు.. పోలీసు శాఖ మీకు అండగా ఉంది" అంటూ ఎస్పీ వారిని ఓదార్చి ధైర్యం కల్పించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి గిరిబాబు, డిసిఆర్బి డిఎస్పీ బాలాజీ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సుధరణి, ఎస్సైలు, విజయ్ కుమార్, జగన్మోహన్ అంజద్, హైమా, భరోసా, షీ టీం, ఏ హెచ్ టి యు, సిబ్బంది, డాక్టర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



**నల్గొండ, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా భారత మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా నల్గొండ హైదరాబాద్ రోడ్డులోని రాజీవ్ గాంధీ విగ్రహానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..**

దేశానికి సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదే ముందుచూపుతో సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ పునాది వేశారని మంత్రి అన్నారు. దేశ అభివృద్ధిలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

**పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలు**

పేద ప్రజల కోసం రాజీవ్ గాంధీ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, ప్రజల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు.

**యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు**

యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదేనని మంత్రి గుర్తుచేశారు.

**దేశం కోసం ప్రాణత్యాగం చేసిన నేత**

దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్ గాంధీ త్యాగాలు మరువలేనివని, త్యాగాల కుటుంబంగా గాంధీ కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు.

**రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం**

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే కాంగ్రెస్ పార్టీ ఏకైక లక్ష్యమని, ఆ దిశగా పార్టీ శ్రేణులంతా సమిష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

**సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చిన దేవత**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధీ పాత్రను మంత్రి కొనియాడుతూ, తెలంగాణ ఇచ్చిన దేవతగా సోనియా గాంధీని ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు.

**బీజేపీపై మంత్రి విమర్శలు:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తోందని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీలు గుమ్ముల మోహన్ రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, కనగల్ మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస గౌడ్, స్థానిక కార్పొరేటర్ ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**దేవరకద్ర, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర నియోజకవర్గం, కౌకుంట్ల మండల పరిధిలోని పేరూరు గ్రామంలో స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పేరూరు గ్రామ సర్పంచ్ శృతి అరవింద్ రెడ్డి రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో పాల్గొని భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి 82వ జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఆధునిక భారత నిర్మాత, రాజకీయానికి నవమార్గదర్శి, భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి 82వ జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ గారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సర్పంచ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఫిట్‌నెస్ లేని వాహనాలపై ఆర్డీఓ కొరడా.. హైవేపై ముమ్మర తనిఖీలు



**దేవరకద్ర ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ రహదారి 44 పై నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రయాణిస్తున్న వాహనాలపై జిల్లా ఆర్డీవో అధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. కొత్తకోట మండలం జాతీయ రహదారికి సమీపంలో వాహనాలను తనిఖీ చేసి ఫిట్నెస్ లేని వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలకు జరిమానాలు విధించారు, ఈ సందర్భంగా ఆర్డీవో సురేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్ హెచ్ 44 పై అధిక లోడుతో ప్రయాణించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .ప్రజల ప్రయాణానికి బొలేరు తదితర వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా వినియోగించవద్దని సూచించారు. బొలెరో వాహనదారులు అధిక లోడుతో లేదా ప్రయాణికుల భద్రతకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. హైవేపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్స్ ఏర్పాటు చేశామని నిర్ణీత వేగ పరిమితిని మించి ప్రయాణించే వాహనాలను గుర్తించి జరిమానాలు విధిస్తామని తెలిపారు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ సురక్షి తంగా ప్రయాణించాలని కోరారు. తనిఖీలు ఆర్డిఓ సురేష్ కుమార్ తో పాటు ఆర్డీవో సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలతో రైతులకు ప్రయోజనం

- ఆయిల్‌పామ్ సాగుతో మంచి ఆదాయం
- వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్



**గద్వాల, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో పంట మార్పిడిలో భాగంగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల కార్యదర్శి సురేంద్ర మోహన్ సూచించారు. ఆయిల్‌పామ్ సాగుతో మంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా మానోపాడ్ మండలం జల్లాపూర్ గ్రామంలో రైతు కంకణాల రామ్‌రెడ్డి 50 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. 248 టన్నుల దిగుబడితో రూ.58.03 లక్షల ఆదాయం పొందిన రైతును అభినందించారు. బిందు సేద్యం, పామ్ మొక్కలపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నాగన్న సాగు చేసిన రాయితీ కంది పంటను, ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలించారు. జిల్లాలో సాగవుతున్న ఉద్యాన, వ్యవసాయ పంటలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ మధుమోహన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఉద్యాన వ్యవసాయ అధికారులు, ఆయిల్‌ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫేజ్-2పై బీజేపీ కార్యశాల


- ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించాలి
- బీఎల్‌ఏలకు దిశానిర్దేశం చేసిన డీకే స్నిగ్ధారెడ్డి



**గద్వాల, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షతన గద్వాల అసెంబ్లీ స్థాయి ఎస్ఐఆర్ ఫేజ్-2 కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్‌ను సీరియస్‌గా తీసుకుని ఫేజ్-2లో ముసాయిదా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఓటు లేకపోతే ఫారం-6, చనిపోయిన లేదా బోగస్ ఓట్ల తొలగింపునకు ఫారం-7, తప్పుల సవరణకు ఫారం-8 ద్వారా చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఏ-2లకు దిశానిర్దేశం చేశారు. నోటీసులు వచ్చిన ఓటర్లు సమాధానం ఇచ్చి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. బోగస్ ఓట్ల తొలగింపుపై ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రవికుమార్ ఎక్బోటే, శ్యామ్‌రావు, ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ మహేష్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, మాజీ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ త్యాగరాజుపాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల.. విద్యార్థులకు సృజనాత్మక కార్యశాల

-'రచనా కళ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రధానోపాధ్యాయులు.



**పర్వతగిరి, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కందు కూరి నవీన్ కుమార్ అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు, శాంతా వసంతా ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులకు "సృజనాత్మక కార్యాశాల" కార్యక్రమంలో భాగంగా పర్వతగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్ అధ్యక్షతన సదస్సు నిర్వహించడం జరిగింది. తెలంగాణ సారస్వత భవిష్యత్తు ఆధ్వర్యంలో ముద్రిం~బడిన 'రచనా కళ' అనే పుస్తకాన్ని ప్రధానోపాధ్యాయులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి సృజనాత్మక అంశాలను నేర్చుకోవడం చాలా ఉపయోగప దుతుందని ఉద్బోధించారు. పాక రమేశ్ బాబు మాట్లాడుతూ పాఠశాలలో 'అక్షర వాహిని' మాస పత్రిక ఆవిష్కరించుకోవడం మంచి పరిణామమని అన్నారు. గతంలో విద్యార్థులకు సృజనాత్మకత పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. అనంతరం కార్యక్రమ సమన్వయ కర్త, స్టేట్ రిసోర్స్ పర్సన్ డా. మడత భాస్కర్ విద్యార్థులకు తెలుగు సాహిత్యములోని పలు ప్రక్రియలను వివరిస్తూ "లేఖ" ప్రక్రియ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులకు, "రచనా కళ" పుస్తకంతో పాటు, సర్టిఫికెట్ కూడా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, స్టాఫ్ సెక్రటరీ శానుం వెంకన్న , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సోన్ మండల కేంద్రంలో ఘనంగా
# రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**సోన్, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
సోన్ మండలం కేంద్రంలోని అంబేద్కర్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో సమాచార సాంకేతిక (ఐటీ) విప్లవానికి నాంది పలికిన ఘనత రాజీవ్ గాంధీదేనని కొనియాడారు. 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించి, పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా అధికార వికేంద్రీకరణకు ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. దేశ పురోగతి కోసం ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మొయినుద్దీన్, ఆత్మ డైరెక్టర్ లు గాండ్ల లింగన్న,చిలారి సాయికుమార్ ,మాజీ వైస్ ఎంపీపీ మురళీధర్ రెడ్డి, మండల జనరల్ సెక్రటరీ లు అజహర్, రాజా రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ప్రేమ్, మాజీ ఉప సర్పంచ్ దాసరి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి లింగన్న, దేవేందర్, కంచెట్టి , సాయి కుమార్,రమేష్, అర్బాస్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంటను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి



**సోన్, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
సోన్ మండలంలో పాకపట్ల గ్రామం, పత్తి పంటను మండల వ్యవసాయ అధికారి జి. వినోద్ కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, పచ్చదోమ మరియు పెనుబంక ఉధృతిని గమనించారు.ఈ పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి ఆకుల నుంచి రసం పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుపోయే అవకాశం ఉందని రైతులకు తెలిపారు. పురుగుల ఉధృతిని గుర్తించేందుకు, తగ్గించేందుకు పంటలో అక్కడక్కడా పసుపు రంగు మరియు నీలం రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.
పురుగుల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు వ్యవసాయ శాఖ సిఫారసుల మేరకు ఫ్లానికామిడ్, ఫిప్రోనిల్ లేదా డైఫెన్థియూరాన్ వంటి పురుగు మందులను తగిన మోతాదులో పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. మందులను అవసరానికి అనుగుణంగా, లేబుల్‌పై సూచించిన మోతాదులో మాత్రమే ఉపయోగించాలని తెలిపారు.ఈ పత్తి పంట పరిశీలన కార్యక్రమంలో రైతులు ముత్యం రెడ్డి, సుధాకర్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభివృద్ధిని చూసి ఓర్వలేకే అబద్ధపు ఆరోపణలు

సతీష్ రెడ్డి ఆరోపణల్లో వాస్తవం లేదు

మల్లంపల్లి ఉప సర్పంచ్ అంకం సురేష్ ముదిరాజ్




**మల్లంపల్లి, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
ములుగు జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మల్లంపల్లి ఉప సర్పంచ్, ములుగు జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అంకం సురేష్ ముదిరాజ్ అన్నారు.మంత్రి సీతక్క నాయకత్వంలో జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు.ఈ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు.యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు యువజన నాయకుడు సూర్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా టోర్నమెంట్లను అభినందించాల్సిందిపోయి వాటిపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు క్రీడల్లో అవకాశాలు కల్పించడం మంచి పరిణామమని పేర్కొన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ములుగు జిల్లాకు చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమంపై ఆ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని అంకం సురేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. అభివృద్ధి, సంక్షేమంపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.మంత్రి సీతక్క, యువజన నాయకుడు సూర్యపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని సూచిస్తూ.. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని,ఎవరు ప్రజల కోసం పనిచేస్తున్నారో వారికి స్పష్టంగా తెలుసని అన్నారు.

## తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు మానుకోవాలి

- కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే దుష్ప్రచారం
- బిఆర్ఎస్ ఆరోపణలను ఖండించిన జింక వేణు



**మల్లంపల్లి, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాంగ్రెస్ పార్టీ, తమ నాయకులకు ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని మల్లంపల్లి 4వ వార్డు మెంబర్ జింక వేణు మండిపడ్డారు.అణగారిన, వెనుకబడిన ప్రాంతాల ప్రజల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి వారికి సరైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ధనసరి సూర్యన్న ప్రజల్లో నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు.ప్రజా సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన సమయంలో వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు.ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని జింక వేణు తెలిపారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులపై ఆరోపణలు చేసే ముందు తగిన ఆధారాలు చూపించాలని, లేనిపక్షంలో అసత్య ప్రచారాలను చట్టపరంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల గౌరవానికి, ప్రజల్లో పార్టీపై ఉన్న విశ్వాసానికి భంగం కలిగించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు.

# విద్యార్థులకు 500 సైకిళ్ల పంపిణీ
## NTPC రామగుండం CSR సహకారంతో కార్యక్రమం

**రామ్‌మందిర్ ఏరియా, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
రామగుండం నియోజకవర్గం గోదావరిఖని అశోక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 500 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. NTPC రామగుండం CSR సౌజన్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ విద్యార్థులు సైకిళ్లను సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ పాఠశాలకు హాజరవుతూ, విద్యాభ్యాసంలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తూ సైకిళ్లను అందించిన NTPC రామగుండం CSR యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, సంబంధిత అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దివంగత మాజీ జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ 50వ జయంతి నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

-కుసుమ జగదీష్ ఆశయ సాధనకు కృషి చేస్తాం
-ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలలో 'జేడీ మల్లంపల్లి' పేరును అధికారికంగా నమోదు చేయాలి
-బీఆర్ఎస్ నాయకులు భూక్యా జంపన్న, మాచర్ల ప్రభాకర్



**మల్లంపల్లి, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
దివంగత ములుగు మాజీ జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ 50వ జయంతి సందర్భంగా మల్లంపల్లి మండల కేంద్రంలోని ఆయన నివాసం వద్ద బీఆర్ఎస్ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం జగదీష్ తల్లిదండ్రులు కుసుమ ఆదినారాయణ,సులోచనలతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమ నాయకుడు జగదీష్ మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో రానున్న రోజుల్లో జగదీష్ కలల సాధన కోసం ములుగు జిల్లా అభివృద్ధికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ములుగు జిల్లా ఏర్పడిన సమయంలో మల్లంపల్లి మండల ఏర్పాటుకు కృషి చేసిన జగదీష్ పేరుతో మల్లంపల్లి మండలానికి 'జేడీ మల్లంపల్లి'గా నామకరణం చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారని గుర్తుచేశారు.అయితే ఇప్పటివరకు పేపర్లలో మాత్రమే 'జేడీ మల్లంపల్లి'గా పేర్కొంటున్నారని,ఏ ప్రభుత్వ కార్యాలయంలోగానీ, గ్రామపంచాయతీలోగానీ అధికారికంగా పేరు నమోదు చేయలేదని అన్నారు.జగదీష్ ఆశయాలకు అనుగుణంగా మల్లంపల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, పోలీస్ స్టేషన్ కార్యాలయాలను త్వరితగతిన ఏర్పాటు చేయడంతో పాటు 'జేడీ మల్లంపల్లి' పేరును అధికారికంగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు.

# నిషేధిత పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలి
## - రైతులతో అవగాహన ర్యాలీ నిర్వహించిన ప్రజ్వల్ ఎన్జీవో






**నల్లబెల్లి, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు ప్రజ్వల్ ఎన్జీవో ఆధ్వర్యంలో గ్రామంలో రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.నిషేధిత,అధిక ప్రమాదకర పురుగు మందుల వినియోగం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు.అనంతరం సేంద్రియ వ్యవసాయంలో భాగంగా పంటలను ఆశించే పురుగుల నివారణకు ఉపయోగపడే వావిలాకు కషాయం తయారీ విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు.ఈ కషాయాన్ని తయారు చేసి రైతులకు అందజేసి,సహజ పద్ధతుల్లో పంటల సంరక్షణపై అవగాహన కల్పించారు.సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి, రైతులు రసాయనిక పురుగు మందులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ ఎన్జీవో కార్యకర్తలు రాజేష్, తరుణ్, భాస్కర్, వసంత, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు




పండ్ల పంపిణి, మొక్కలు నాటిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**తాండూర్, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
భారత దేశ మాజీ ప్రధాని భారత రత్న శ్రీ రాజీవ్ గాంధీ 81వ జయంతిని పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ తాండూర్ మండల్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తాండూర్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పట్టెం విష్ణుకళ్యాణ్ ఆధ్వర్యంలో
తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషంట్లకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. ఈ సందర్భంగా విష్ణుకళ్యాణ్ మాట్లాడుతూ
రాజీవ్ గాంధీ యువతకు ఆదర్శమని, సాంకేతిక పరిజ్ఞానం, పంచాయతీ రాజ్ వ్యవస్థతో దేశాన్ని ముందుకు తీసుకెళ్లిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముడిమాడుగుల సురేష్, మాజీ ఎంపిపి సిరంగి శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి ఈసా, కిష్టంపేట సర్పంచ్ సార్ల తిరుపతి, గోవర్ధన్, సింగిల్ విండో డైరెక్టర్ మసాడి తిరుపతి, ఉప సర్పంచ్లు, డాక్టర్ సత్యనారాయణ, నల్లుల మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాత నాగరాజు, ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ఝాన్సీ రాణి, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పురం శెట్టి అరుణ్, వార్డు సభ్యుడు పులగం శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, నియాజ్, ప్రశాంత్, ముహ, చీర్ల రాజేశం, నరేందర్, ప్రసాద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయ సేకరణ
## పటాన్‌చెరులో కాంగ్రెస్ శ్రేణుల అభిప్రాయాలు సేకరించిన ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు

**పటాన్‌చెరు, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడి నియామక ప్రక్రియలో భాగంగా పటాన్‌చెరులో సితార హోటల్ లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ కార్యక్రమం కొనసాగింది.
ఈ కార్యక్రమానికి ఏఐసీసీ పరిశీలకులు దీపక్ రాథోడ్, టీపీసీసీ పరిశీలకులు రియాజ్, నెరేళ్ల శారద హాజరై పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తల నుంచి డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయాలను సేకరించారు.
కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇంచార్జి నీలం మధు, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం తదితరులు పాల్గొన్నారు





# సమాజానికి సందేశమే లక్ష్యంగా 'తిరగబడ్డ మమకారం'

**రామ్‌మందిర్ ఏరియా, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
నిరీక్షణ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'తిరగబడ్డ మమకారం' లఘుచిత్రం షూటింగ్ గురువారం గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌లోని నిరీక్షణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇప్టా జాతీయ సమితి, ప్రజా నాట్యమండలి కళాకారుడు కవ్వంపల్లి స్వామి, సీనియర్ పాత్రికేయులు దయానంద్ గాంధీ, ఎన్పీడీసీఎల్ రిటైర్డ్ ఏడీఈ కె. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై చిత్రీకరణను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పోతుల చంద్రపాల్ రూపొందించిన లఘుచిత్రాలు సామాజిక అంశాలను ఇతివృత్తాలుగా తీసుకుని సమాజాన్ని ఆలోచింపజేసేలా రూపొందించారని తెలిపారు. అదే తరహాలో 'తిరగబడ్డ మమకారం' కూడా సమాజానికి చక్కటి సందేశాన్ని అందించేలా తెరకెక్కుతోందన్నారు. కన్నవాళ్లను నిరాశ్రయులను చేసినప్పుడు తల్లిదండ్రులు తమ మమకారాన్ని చంపుకుని తిరగబడితే ఎలాంటి పరిస్థితులు ఏర్పడతాయనే అంశాన్ని ఈ చిత్రంలో చూపించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల పట్ల పిల్లలు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ చిత్రం తెలియజేస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం లఘుచిత్రాల పేరుతో కొందరు అభ్యంతరకరమైన టైటిళ్లు, దృశ్యాలతో చిత్రాలను రూపొందించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దర్శకులు, నిర్మాతలు వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక చిత్రాలను రూపొందించాలని సూచించారు. 'తిరగబడ్డ మమకారం' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. గతంలో పలు సామాజిక అంశాలపై లఘుచిత్రాలను రూపొందించిన పోతుల చంద్రపాల్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు.



సీనియర్ పాత్రికేయులు మేజిక్ రాజా, పోతు శంకరయ్య, సిరిపురం శ్రీనివాస్, అలాగే సతీష్, శ్రీలత, రజిత, వేదశ్రీ, అస్మిత్ పాల్గుణ, రియా వృంద తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తిప్పబత్తిని అంజయ్య మేకప్‌మెన్‌గా, కో-డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీరుక లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గారికి ఘన నివాళులు..
## ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే విజయరమణ రావు..

**పెద్దపల్లి, ఆగస్టు 21 (జర్నలిస్ట్ ఫైల్) :**
స్వర్గీయ మాజీ ప్రధాని భారత రత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అర్పించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పట్టణ, మండలం అధ్యక్షులు మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



## నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌కు మహర్దశ



- 50 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన
- జిమ్ పరికరాలు, బ్యాడ్మింటన్, షటిల్‌కు సౌకర్యాల కల్పన
- అన్ని డివిజన్లలో వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** రెండు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న నల్లచెరువు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక నల్లచెరువు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ. 50 లక్షలతో ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ వాకింగ్ ట్రాక్ ఎత్తు పెంచడంతోపాటు మరుగుదొడ్లు, జిమ్, బ్యాడ్మింటన్ కోర్టు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రెండేళ్ల ఆకముందు నల్లచెరువు వాకింగ్ ట్రాక్ వద్ద ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారిని చెప్పారు. దీంతోపాటు నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో ఒక్కొక్కవాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి అంటే కూటమి ప్రభుత్వమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో పార్కులు స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు కల్పించబోతున్నామన్నారు

**వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సహకరించండి**

బిఆర్ స్టేడియం వద్ద శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకులు తొలగించి నూతనంగా నిర్మించబోతున్నామని, దీనికి ప్రజలు సహకరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బీఆర్ స్టేడియం వద్ద వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. నూతన ట్యాంక్ ఏర్పాటు క్రమంలో కొన్ని ప్రాంతాలకు మంచినీటి సమస్య తలెత్తుతుందన్నారు. సాధ్యమైనంత వరకు ప్రజలకు మంచి సేవలు అందించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ క్యాంపెయిన్ డేస్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ఓటర్ క్యాంపెయిన్ డేస్ నిర్వహిస్తున్నట్లు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.

ప్రత్యేక క్యాంపెయిన్ రోజుల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముసాయిదా ఓటర్ జాబితాతో అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్తగా ఓటు నమోదు, పేరు లేదా చిరునామా వంటి వివరాల్లో మార్పులు, సవరణలు, చేర్పులు చేసుకోవాలనుకునేవారు సంబంధిత పోలింగ్ కేంద్రంలో దరఖాస్తులు సమర్పించవచ్చని వెల్లడించారు.

ముసాయిదా ఓటర్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నా బీఎల్ఓల ద్వారా నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలు సరిచూసుకుని అవసరమైన మార్పులు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక క్యాంపెయిన్ రోజుల్లో బీఎల్ఓలు నిర్ణీత సమయంలో పోలింగ్ కేంద్రాల్లో విధిగా హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేలా ఏఈఆర్ఓలు, సూపర్వైజరీ అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

## ఎంపీ అవినాశ్ రెడ్డి ఇంట్లో ఈడీ రైడ్.. భారీగా డబ్బు సీజ్..

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :వైఎస్ వివేకానందారెడ్డి హత్య కేసులో దూకుడు పెంచిన ఈడీ అధికారులు నిందితుడు కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్, కడపతో పాటు 7 ప్రాంతాల్లో సోదాలు చేశారు. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్లు ఆధారంగా ఈసీఐఆర్ చేసిన అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లెక్కలు చూపని రూ.24 లక్షలను సీజ్ చేశారు. రెండు బ్యాంకు లాకర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఈడీ అధికారులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ వివేకానందారెడ్డిని చంపేందుకు అంతకు నెల ముందే ప్లాన్ చేసినట్లు అప్రూవర్ దస్తగిరి చెప్పారని తెలిపారు. వివేకా హత్య కోసం దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి రూ. 40 కోట్లు ఆఫర్ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో ఐదు కోట్ల రూపాయలు దస్తగిరికి ఇచ్చేలా ఎర్రగంగిరెడ్డి మాట్లాడారని అధికారులు స్పష్టం చేశారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అదే విధముగా జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళామాధవి ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అదే విధంగా గురువారం జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయటం పాటు, వారి సమస్యలను పరిష్కరించాలని కోరటం పై హర్షం వ్యక్తం చేస్తూ పలు జర్నలిస్ట్ సంఘాల ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలుసుకొని ధన్యవాదాలు తెలిపి, సత్కరించారు.

అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటుండటంతో ప్రజలు సంతృప్తిగా వెళ్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.



కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రతి వర్గం, ప్రతి వృత్తి, ప్రతి సంస్థ అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు.

ఈ సందర్భంగా అసెంబ్లీలో జర్నలిస్టుల సంక్షేమంపై తాను ప్రస్తావించిన అంశాన్ని వివరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు నిజమైన సమాచారాన్ని చేరవేసేందుకు ఎన్నో కష్టాలు, ప్రమాదాలను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులకు కనీస భద్రత, సంక్షేమం అవసరమని పేర్కొన్నారు.

అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయం, ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు కల్పించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. జర్నలిస్టులు చాలా తక్కువ వేతనాలతో, నిరంతర ఒత్తిడిలో పనిచేస్తున్నప్పటికీ సమాజానికి సేవ చేస్తున్నారని అన్నారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా గృహ వసతి, ఆరోగ్య భద్రత అందించాల్సిన అవసరం ఉందన్నారు.

గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారని, జర్నలిస్టు కాలనీల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. జర్నలిస్టుల కోసం గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేసి, వారి సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

గత ఐదేళ్లలో అనేక వర్గాల మాదిరిగానే జర్నలిస్టుల సమస్యలు కూడా నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రతి వర్గం సమస్యలపై దృష్టి సారిస్తోందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయాలు లేదా ఇంటి స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరినట్లు వెల్లడించారు.

ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో హౌసింగ్ వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం సవాలుతో కూడుకున్నప్పటికీ, ప్రతి వర్గానికి న్యాయం చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తారనే నమ్మకం ఉందని, రానున్న రోజుల్లో జర్నలిస్టుల హౌసింగ్, హెల్త్ కార్డుల అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి అనే మూడు లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి సహకరించి కొంత సమయం ఇస్తే ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విశ్వాసం వ్యక్తం చేశారు.

## అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ఓల్డ్ గుంటూరులో కార్డన్ సెర్చ్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన, నేర నియంత్రణ, ప్రజల భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా గుంటూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఓల్డ్ గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇజ్రాయిల్‌పేట, మణిపురం ఫ్లైఓవర్ సమీప ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు సాగిన ఈ తనిఖీలను ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీతారాం పర్యవేక్షించారు.



కార్డన్ సెర్చ్‌లో కొత్తపేట, లాలాపేట, ఓల్డ్ గుంటూరు పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది, ఎస్‌టీఎఫ్ బృందాలు పాల్గొని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాల పరిశీలనలో 46 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు సంబంధించిన పత్రాలు సక్రమంగా లేనట్లు గుర్తించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు ప్రారంభించారు.

తనిఖీల అనంతరం 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు ఇంజెక్షన్లు, మత్తు మాత్రల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక దుష్ప్రభావాలను వివరించడంతో పాటు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణా వంటి చర్యలకు ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.

ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 150 మంది స్థానికులు పాల్గొని మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. ప్రజల సహకారంతోనే డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడం సాధ్యమవుతుందని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్‌లు, వాహన తనిఖీలు, ప్రత్యేక నిఘా, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.

## అసెంబ్లీకి 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు ఎందుకు రాలేదు

- జీతాలు తీసుకుంటూ ప్రజా సమస్యలను గాలికొదిలేశారు - వైసీపీ ఎమ్మెల్యేలపై జీవీ ఫైర్
- సభను ఎదుర్కొనే దమ్ము లేకే వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేశారు.
- అసెంబ్లీ నుంచి పారిపోయి పులివెందుల పిల్లుల్లా మారారు
- డీఎస్సీపై లోకేష్ బయటపెట్టిన వాస్తవాలతో వైసీపీ నేతలకు మైండ్ బ్లాక్
- ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి ఐదేళ్లు సీఎం కావడం విడ్డూరం

వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్): ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీ సమావేశాలకు 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంపై ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. ప్రజల ఓట్లతో గెలిచి జీతాలు తీసుకుంటూ ప్రజా సమస్యలను గాలికొదిలేయడం సరికాదన్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు అర్థవంతమైన చర్చలకు వేదికగా నిలిచాయని జీవీ తెలిపారు. మొత్తం 25 గంటల 15 నిమిషాల పాటు సభ కొనసాగగా 103 మంది సభ్యులు ప్రసంగించారని చెప్పారు. 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు కూడా సభకు హాజరై ఉంటే మరో 11 మంది సభ్యులు ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం ఉండేదన్నారు.



సభను ఎదుర్కొనే దమ్ము లేకే వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేశారని జీవీ ఆంజనేయులు విమర్శించారు. అసెంబ్లీ నుంచి పారిపోయి పులివెందుల పిల్లుల్లా మారారు అంటూ సెటైర్ వేశారు. దేవాలయం లాంటి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేకపోవడం వైసీపీ నేతల వైఖరికి నిదర్శనమన్నారు.

తమ బండారం బయటపడుతుందనే భయంతోనే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి దూరంగా ఉన్నారని ఆరోపించారు.

మరోవైపు మండలిలో గందరగోళం సృష్టిస్తూ ప్రజా సమస్యలపై చర్చకు అడ్డుపడుతున్నారని విమర్శించారు.

డీఎస్సీ విషయంలో మంత్రి నారా లోకేష్ గారు బయటపెట్టిన వాస్తవాలతో వైసీపీ నేతలకు మైండ్ బ్లాక్ అయిందని అన్నారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేయడం విడ్డూరంగా ఉందని జగన్‌పై విమర్శలు గుప్పించారు.

ఏపీపీఎస్సీ అక్రమాలపై సమాధానం చెప్పాల్సి వస్తుందనే భయంతోనే జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో దాక్కున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాల్సిన బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతి ఎమ్మెల్యేపైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రముఖ నటి షావుకారు జానకి మృతి పట్ల మంత్రి దుర్గేష్ దిగ్భ్రాంతి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ 'షావుకారు' జానకి మృతి పట్ల రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు.

"'షావుకారు' చిత్రంతో సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొని 'షావుకారు జానకి'గా విశేష కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారు. రాజమహేంద్రవరంలో జన్మించిన ఆమె దశాబ్దాలకు పైగా సాగిన తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించి, వైవిధ్యమైన పాత్రలతో సహజ నటనను ప్రదర్శించి కోట్లాది మంది అభిమానులను మెప్పించారు" అని గుర్తుచేసుకున్నారు. తెలుగు చిత్రసీమలో తన అభినయంతో చెరగని ముద్ర వేసిన షావుకారు జానకి మరణం కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు..ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన సానుభూతిని తెలిపారు.

## శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శని,ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ నెల 22, 23 తేదీలలోనూ, 29, 30 తేదీల్లోను ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు (బి.ఎల్.ఓ) ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. ముసాయిదా ఓటరు జాబితా బి.ఎల్.ఓల వద్ద లభ్యంగా ఉందని, ఓటర్లు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకొనుటకు, వివరాల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయుటకు సంబంధిత పోలింగ్ కేంద్రంలో బిఎల్ఓలను సంప్రదించి ఫారం 6, 7 లేదా 8 అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటును పదిలపరచుకోవాలని కోరారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి వచ్చే వారికి స్పష్టమైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

- మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారి ఆధ్వర్యంలో తొలిసారిగా అంగరంగ వైభవంగా నిర్వహణ

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి మఠ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీ వీరభోగ వసంత వేంకటేశ్వరస్వాముల వారి స్మారక భవనం (కళ్యాణ మండపం)లో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మఠాధిపతులు శ్రీ-శ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారి ఆధ్వర్యంలో, వారి ధర్మపత్ని మాత ఉమాదేవి చేతుల మీదుగా వ్రత పూజా కార్యక్రమాలను ప్రారంభించారు.

మఠాధిపతుల సోదరులు దత్తాత్రేయ స్వాములవారు, వారి ధర్మపత్ని రాధా గారు సతీసమేతంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మఠంలో తొలిసారిగా సామూహికంగా వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించడంతో స్థానిక మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఆచరించే వరలక్ష్మీ వ్రతం అత్యంత పవిత్రమైనదని, లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా కుటుంబ సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగడంతో పాటు అష్టలక్ష్ముల అనుగ్రహం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. సుమంగళీ ప్రాప్తి, కుటుంబ సౌభాగ్యం, సంతానాభివృద్ధి, ధనధాన్య సమృద్ధి కలగాలని కోరుకుంటూ మహిళలు ఈ వ్రతాన్ని ఆచరిస్తారని పేర్కొన్నారు.

అందరికీ వరలక్ష్మీ వ్రత భాగ్యం కల్పించాలనే సదాశయంతో మఠం ఆధ్వర్యంలో సామూహికంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలను మఠ ఆస్థాన ఆధ్వర్యులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన స్థానిక పెద్దలు, విలేఖరులను మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాములవారు దుశ్శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**తొలిసారి నిర్వహించడం ఆనందంగా ఉంది:**

మఠంలో ఇంతటి ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించడం ఇదే తొలిసారని, ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని స్థానిక భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే వరుణ్ హై స్కూల్ కరెస్పాండెంట్ ఇవి రమణారెడ్డి ఆదేశాల మేరకు వరుణ్ హైస్కూల్ విద్యార్థినిలు , టీచర్లు వరలక్ష్మి వ్రతంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దర్శించుకున్నారు. విద్యార్థినిలకు మఠం యాజమాన్యం ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదం లు అందజేశారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# మార్గదర్శిపై సుప్రీంకోర్టు తీర్పు సత్యానికి, న్యాయానికి విజయం

○ బీజేపీ రాష్ట్ర మీడియా విభాగం ఇంచార్జీ కిలారు దిలీప్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :మార్గదర్శి ఫైనాన్షియర్స్ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన ప్రత్యేక అనుమతి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం సత్యానికి, న్యాయానికి దక్కిన విజయమని బీజేపీ రాష్ట్ర మీడియా విభాగం ఇంచార్జీ కిలారు దిలీప్ పేర్కొన్నారు. దశాబ్దాలుగా కొనసాగిన న్యాయ వివాదానికి ఈ తీర్పుతో ముగింపు పలికిందని ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

కిలారు దిలీప్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా పిటిషన్ నిర్వహణపై ధర్మాసనం లేవనెత్తిన ప్రశ్నలు ఈ కేసు స్వరూపాన్ని స్పష్టం చేశాయని అన్నారు. ప్రజా ప్రయోజనాల పేరిట సాగిన ఈ వివాదానికి న్యాయస్థానం తుది నిర్ణయం ఇచ్చిందని, మార్గదర్శికి అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు నిలబెట్టడం చట్టబద్ధ ప్రక్రియపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసిందని పేర్కొన్నారు.

మార్గదర్శి సంస్థ డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు కట్టుబడి వ్యవహరించిందని, సంస్థ తరఫు న్యాయవాదులు డిపాజిటర్లకు నిధుల చెల్లింపులు, ఎస్క్రో ఖాతా నిర్వహణ తదితర అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారని దిలీప్ తెలిపారు. న్యాయస్థానం ముందు జరిగిన మొత్తం ప్రక్రియ పారదర్శకంగా సాగిందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రామోజీరావును స్మరించిన కిలారు దిలీప్, వ్యాపార విలువలు, డిపాజిటర్ల నమ్మకాన్ని కాపాడటంలో ఆయన చూపిన నిబద్ధత ఈ తీర్పుతో మరోసారి ప్రతిఫలించిందని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు నిర్ణయం మార్గదర్శిపై సంవత్సరాలుగా కొనసాగిన వివాదానికి చట్టపరమైన ముగింపు పలికిందని, రామోజీరావు ధర్మపోరాటానికి ఇది నైతిక విజయమని ఆయన వ్యాఖ్యానించారు.

# ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు జేఏసీ ఒప్పందాలు




**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్)** : ఆర్టీసీ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రతను పరిరక్షించడమే లక్ష్యంగా ఆర్టీసీ జేఏసీ యాజమాన్యంతో చర్చలు జరిపి పలు కీలక అంశాలపై ఒప్పందాలు సాధించిందని జేఏసీ కన్వీనర్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఉద్యోగులకు భద్రతతో పాటు భరోసా కల్పించే విధంగా యాజమాన్యం సానుకూల నిర్ణయాలు తీసుకుందని చెప్పారు.

విశాఖపట్నంలోని వాల్తేరు ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం విజయనగరం జోన్ పరిధిలోని ఆరు జిల్లాల నాయకులతో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జోనల్ అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు అధ్యక్షతన, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా యాజమాన్యంతో చర్చల ద్వారా పరిష్కార మార్గాలను సాధిస్తున్నామని అన్నారు. ఉద్యోగ భద్రత, సంక్షేమం, పదోన్నతులు, ఖాళీల భర్తీ, కొత్త బస్సుల కొనుగోలు, విద్యుత్ బస్సుల ప్రవేశపెట్టడంలో ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణ విషయంలో జేఏసీ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాల ఫలితంగానే పలు అంశాలపై యాజమాన్యం అనుకూలంగా స్పందించి సంబంధిత సర్క్యులర్లు జారీ చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగులకు నష్టం కలిగించే ఏ నిర్ణయం వచ్చినా జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, హక్కుల సాధనకు ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి జేఏసీ కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర, జోన్, రీజియన్, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# రూ.9 వేల కోట్ల బాండ్ సమీకరణకు ఏపీఎండీసీకి జాతీయ గౌరవం




○ రాష్ట్ర అనుబంధ సంస్థగా 'ఉత్తమ రాష్ట్ర అనుసంధాన జారీదారు' పురస్కారం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థ ఆంధ్రప్రదేశ్ ఖనిజ అభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కు ప్రతిష్ఠాత్మక 'ఉత్తమ రాష్ట్ర అనుసంధాన జారీదారు' జాతీయ పురస్కారం లభించింది. ముంబైలో నిర్వహించిన జాతీయ కార్పొరేట్ బాండ్ మార్కెట్ సదస్సు--పురస్కారాల కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. సెక్యూర్డ్ డిబెంచర్ల ద్వారా రూ.9 వేల కోట్ల నిధులను విజయవంతంగా సమీకరించిన ఘనతకు ఈ గుర్తింపు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థగా దేశంలోనే భారీ స్థాయిలో బాండ్‌ల ద్వారా నిధులు సమీకరించడం ఏపీఎండీసీకి కీలక మైలురాయిగా నిలిచింది. ఈ లావాదేవీ సంస్థ ఆర్థిక నిర్వహణ సామర్థ్యం, పారదర్శక పరిపాలన, నియంత్రణ నిబంధనల అనుసరణ, సుపరిపాలన ప్రమాణాలను ప్రతిబింబించిందని సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందించిన దూరదృష్టి నాయకత్వం, మార్గదర్శకత్వానికి ఏపీఎండీసీ కృతజ్ఞతలు తెలిపింది. మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో ఈ బాండ్ జారీ విజయవంతమైందని పేర్కొంది. పురస్కార ఎంపిక ప్రక్రియలో గవర్నెన్స్, ఆర్థిక క్రమశిక్షణ, నియంత్రణ నిబంధనల అమలు, కార్యాచరణ సామర్థ్యం, ఆవిష్కరణలు, పరిశ్రమ అభివృద్ధికి చేసిన కృషి వంటి అంశాలను స్వతంత్ర నిపుణుల జ్యూరీ సమగ్రంగా పరిశీలించింది. ఈ అవార్డు రాష్ట్ర ఖనిజ రంగ సుస్థిర అభివృద్ధి, పారదర్శక పరిపాలన, ఉత్తమ ఆర్థిక నిర్వహణ పట్ల ఏపీఎండీసీ నిబద్ధతకు జాతీయ స్థాయి గుర్తింపుగా నిలిచిందని సంస్థ తెలిపింది.

# విద్య, వైద్య రంగాల బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత

○ యువతకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు

○ కోటబొమ్మాళి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చిరకాల కోరిక సాకారం

○ మూలపేట పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి



**కోటబొమ్మాళి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలో డిగ్రీ కళాశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా. ఆయన మాట్లాడుతూ కోటబొమ్మాళి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్న తన చిరకాల కోరిక సాకారం కావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. యువతకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడంతో పాటు వారికి విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల స్థాపన అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల రూ.2,600 కోట్ల పెట్టుబడితో 450 ఎకరాల విస్తీర్ణంలో కోరమండల్ పరిశ్రమను మూలపేటలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. దేశంలోని ప్రముఖ పరిశ్రమలు మూలపేటలో తమ పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు రావడం శుభ పరిణామమని, రానున్న రోజుల్లో మూలపేట పోర్టు ప్రాంతం పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చెందనుందని అన్నారు.

**విద్యతోనే యువతకు బంగారు భవిష్యత్తు** : విద్యతోనే యువతకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నత విద్యకు సంబంధించి సమగ్ర విధానాలను అమలు చేస్తూ ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా చారిత్రాత్మక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కోటబొమ్మాళి డిగ్రీ కళాశాలకు త్వరలో శాశ్వత భవనం నిర్మించేందుకు చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

ఐదు ఎకరాల విస్తీర్ణంలో కళాశాల భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేలా అవసరమైన కోర్సులను డిగ్రీ కళాశాలలో మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం** : ప్రజా ప్రభుత్వంగా అన్ని వర్గాల సంక్షేమం, అన్ని రంగాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి అన్నారు. శ్రీకాకుళం జిల్లా వెనుకబాటుతనాన్ని రూపుమాపి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడినప్పటికీ వంశధార కాలువల నుంచి సాగునీటిని అందించి రైతులకు అండగా నిలిచామని మంత్రి గుర్తు చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పంట బీమా నమోదుకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శత శాతం పంట బీమా నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు.

**కొత్తమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు** : కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు.

ఆలయ అభివృద్ధి పనులను చేపట్టి గత ఏడాది కంటే మరింత వైభవంగా ఈ ఏడాది కొత్తమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

అనంతరం డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలను మంత్రి చేతులమీదుగా మొక్కలను నాటారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఇంచార్జ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా, టి. గోవిందమ్మ, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా, ఎన్.ఎస్. ఎన్.మూర్తి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. అప్పన్న, తదితరులు, పాల్గొన్నారు.

# టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం : ఎమ్మెల్యే నసీర్

○ బీసీలకు 34 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మక ఘట్టం

○ జగన్ పాలనలో బీసీలపై ధమనకాండ

○ డీఎస్సీపై అసెంబ్లీకి వచ్చి మాట్లాడే దమ్ము లేదా జగన్

○ ఏపీపీఎస్సీ అక్రమాలకు ఏం సమాధానం చెబుతావు

○ మీడియా సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ )**: బీసీలకు రాజ్యాధికారం తెలుగుదేశం పార్టీ హయాంలోనే లభించిందని, రాష్ట్రంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం నిజమైన సామాజిక న్యాయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజ్యాధికారం అన్ని వర్గాలకు అందించాలనే సదుద్దేశంతో స్వర్గీయ నందమూరి తారకరామారావు బీసీలకు రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. దీనిని కొనసాగిస్తూ రాష్ట్ర విభజన అనంతరం తెలుగుదేశం పార్టీ బీసీలకు సముచితస్థానం కల్పించిందని చెప్పారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం బీసీలపై ధమనకాండ చేస్తూ 33 శాతం ఉన్న రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించేసిందని విమర్శించారు. 16800 మంది బీసీలకు రాజ్యాధికారం రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. కూటమి పాలల్లో స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించడం గొప్ప విషయమన్నారు. బీసీ వర్గంలో క్లస్టర్ ఇంచార్జి ఉన్న మహిళకు ఎమ్మెల్సీ,, రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రి పదవి, మరొక నేతకు స్పీకర్ పదవి ఇలా సముచిత స్థానం కూటమి ప్రభుత్వంలోనే వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో డీఎస్సీపై అడ్డగోలుగా విమర్శలు చేస్తోన్న జగన్ దమ్ముంటే అసెంబ్లీలోకి వచ్చి మాట్లాడాలన్నారు. యువ నాయకులు నారా లోకేష్ సవాల్ విసిరితే జగన్ చేతకాని దద్దమ్మలా చేతులుముడుచుకు కూర్చున్నారని విమర్శించారు. డీఎస్సీలో 350 కేసులు వేసిన ఒక్కటి నిరూపించలేకపోగా కోర్టు చివాట్లు పెట్టినా వైసీపీకి బుద్ధి రాలేదన్నారు. ఏపీపీఎస్సీ పరీక్షలను అడ్డగోలుగా నిర్వహించిన జగన్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో చేనేతలకు, గౌడలకు ఇలా అన్ని వర్గాలకు అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమైందని తెలిపారు.

# నేడు కేరళం రాష్ట్రానికి పవన్ కళ్యాణ్

○ వైద్యుల సూచన మేరకు భుజానికి ఆయుర్వేద థెరపీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ శనివారం కేరళం రాష్ట్రానికి వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజం రొటేటర్ కఫ్ గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన, వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సలో భాగంగా ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు.

శస్త్ర చికిత్స అనంతరం వైద్యులు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. కొంతకాలం బహిరంగ కార్యక్రమాలు , విధులకి దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. పాలనా బాధ్యతల దృష్ట్యా వారం రోజుల్లోనే పవన్ కళ్యాణ్ గారు క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు. ముందస్తుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడం, వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను నిర్వహించడం చేశారు. ఈ క్రమంలో శస్త్ర చికిత్స చేసిన భుజం భాగంలో వాపు పెరగడంతోపాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చింది. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేందుకు కేరళంలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు.

# బీసీలకు దక్కాల్సిన రాజకీయ హక్కులు బీసీలకే దక్కాలి



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్)** : స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ అన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు.

శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు స్థానిక సంస్థల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. గతంలో అమలులో ఉన్న బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీల రాజకీయ ప్రాతినిధ్యం దెబ్బతిన్నదన్నారు. ఆ సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా బెదిరింపులు, అక్రమాలు, దౌర్జన్యాల మధ్య జరిగాయని విమర్శించారు.

**బీసీల హక్కులను ఇతర వర్గాలకు మళ్లించొద్దు** : బీసీ సమాజం ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న రాజకీయ హక్కులను ఓటుబ్యాంక్ రాజకీయాల కోసం ఇతర వర్గాలకు కేటాయించడం సరికాదని గోపి శ్రీనివాస్ అన్నారు. గతంలో స్థానిక సంస్థల్లో ముస్లింలకు బీసీ కోటా ద్వారా కల్పించిన రాజకీయ ప్రాతినిధ్యంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

"ఇది ఏ వర్గానికీ వ్యతిరేకమైన డిమాండ్ కాదు. ఎవరికైనా రాజకీయ అవకాశాలు కల్పించాలంటే వారికి చట్టబద్ధంగా ఉన్న ఇతర మార్గాల్లో అవకాశాలు కల్పించాలి. బీసీలకు కేటాయించిన రాజకీయ రిజర్వేషన్లు మాత్రం బీసీలకే దక్కాలి" అని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. ప్రతి అంశాన్ని పరిశీలించి ప్రజానుకూల నిర్ణయాలు తీసుకునే ముఖ్యమంత్రి తమకు ఉన్నారని, బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే నమ్మకం ఉందన్నారు.

**"మోదీ హయాంలో సామాజిక న్యాయానికి పెద్దపీట** : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం బీసీల సామాజిక, రాజకీయ, విద్యా అభ్యున్నతికి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని గోపి శ్రీనివాస్ తెలిపారు. 102వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించడం, రాష్ట్రాలకు కూడా బీసీ జాబితాల విషయంలో అధికారాలను కల్పిస్తూ 105వ రాజ్యాంగ సవరణ చేయడం సామాజిక న్యాయంలో కీలక మైలురాళ్లని పేర్కొన్నారు.

అదేవిధంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఆయా వర్గాల్లోని పేదలకు కూడా అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు.

కేంద్ర విద్యాసంస్థలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ల అమలు ద్వారా పేద, మధ్యతరగతి బీసీ కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు పెరిగాయని తెలిపారు. నీట్‌లో ఓబీసీ రిజర్వేషన్ల అమలుతో వేలాది మంది బీసీ విద్యార్థులు వైద్య విద్యలో ప్రవేశాలు పొందుతున్నారని అన్నారు. **డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో బీసీలకు మేలు** : కేంద్రంలో మోదీ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అదే స్ఫూర్తితో బీసీల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటోందని గోపి శ్రీనివాస్ అన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను 'డబుల్ ఇంజిన్ సర్కార్'గా అభివర్ణిస్తున్నామని తెలిపారు.

స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్ల నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతకు దోహదపడుతుందని అన్నారు. అయితే ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లు పూర్తిగా బీసీ సమాజానికే దక్కేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని కోరారు.

ఈ సమావేశంలో మీడియా ఇంచార్జి కిలారి దిలీప్, ఓబీసీ మోర్చా రాష్ట్ర రీసెర్చ్ టీం సభ్యుడు మారేష్, కోస్తా జోన్ ఇంచార్జి తుల్లిమిల్లి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి చోరగుడి శివలలిత, కార్యవర్గ సభ్యుడు ఉండవల్లి కృష్ణారావు, ఓబీసీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కందుల సుబ్రహ్మణ్యం యాదవ్, జిల్లా ఇంచార్జి కేతన బోయిన హనుమంతరావు పాల్గొన్నారు.

# 12వ రోజు కొనసాగిన రాష్ట్రవ్యాప్త సమ్మె ... ఫ్లాష్‌లైట్ ర్యాలీతో నిరసన

○ 20% స్టైపెండ్ సవరణతో పాటు మూడు ప్రధాన డిమాండ్లపై లిఖితపూర్వక జీవో కోరిన జూనియర్ డాక్టర్లు

○ ప్రభుత్వ స్పందనకు మరో రెండు రోజుల గడువు: ఏపీ జూడా






**అమరావతి/గుంటూరు, ఆగస్టు 21:** జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ సవరణపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏకపక్ష ప్రకటనను ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) తీవ్రంగా ఖండించింది. వార్షిక స్టైపెండ్ సవరణకు విధానాన్ని గుర్తించడం స్వాగతించదగినదే అయినప్పటికీ, ప్రభుత్వం పేర్కొన్న గణాంకాలు, శాతాలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని ఆరోపించింది. జూనియర్ డాక్టర్ల అకడమిక్, వైద్య విద్యకు సంబంధించిన కీలక డిమాండ్లను పూర్తిగా విస్మరించిందని పేర్కొంది.

విజయవాడలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీ జూడా రాష్ట్ర అధ్యక్షుడు డా. ఈశ్వర్ శంకర్, ప్రధాన కార్యదర్శులు డా. లుఖ్మాన్ అలీ, డా. దినకర్ శ్రీనివాస్, డా. రవి తేజ నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిపాదించిన ఇంటర్న్‌లకు 5 శాతం, పీజీ మరియు సూపర్ స్పెషాలిటీ రెసిడెంట్లకు 3 శాతం వార్షిక పెంపు ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుంటే వాస్తవానికి ఆదాయ తగ్గుదలతో సమానమని అన్నారు. 2026 సంవత్సరానికి 20 శాతం బేస్ ఫిట్‌మెంట్ సవరణ, అనంతరం వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ)తో పాటు 3 శాతం వాస్తవ వృద్ధి ఆధారంగా వార్షిక సవరణ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ డాక్టర్ల స్టైపెండ్లు గణనీయంగా తక్కువగా ఉన్నాయని ఏపీ జూడా పేర్కొంది. ఇంటర్న్‌లు, పీజీ రెసిడెంట్లకు సుమారు 15 శాతం, సీనియర్ రెసిడెంట్లు, సూపర్ స్పెషాలిటీ రెసిడెంట్లకు 35 నుంచి 37 శాతం వరకు వ్యత్యాసం ఉందని తెలిపింది. పీజీ స్టైపెండ్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్ వేతనంతో పోల్చడం తగదని, వారానికి 80 నుంచి 100 గంటలు సేవలందిస్తున్న జూనియర్ డాక్టర్లకు న్యాయమైన పారితోషికం కల్పించాలని కోరింది. తాము కోరుతున్న 20 శాతం బేస్ రివిజన్‌కు రూ.117.21 కోట్లు మాత్రమే అవసరమని, ఇది రాష్ట్ర ఆరోగ్య బడ్జెట్‌లో కేవలం 0.6 శాతం మాత్రమేనని వివరించింది. మెడికల్ కళాశాలల్లో బోధనా సిబ్బంది కొరతను తీర్చేందుకు రిటైర్మెంట్ వయస్సు పెంచడం కాకుండా యువ స్పెషలిస్టులు, సీనియర్ రెసిడెంట్లను నియమించాలని జూడా డిమాండ్ చేసింది. అలాగే నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ఎంఎస్సీ, పీహెచ్‌డీ అధ్యాపకుల నియామకాన్ని 15 శాతం పరిమితిలోనే అమలు చేయాలని, క్లినికల్ విభాగాల్లో నాన్-మెడికల్ సిబ్బందికి క్లినికల్ బాధ్యతలు అప్పగించకూడదని స్పష్టం చేసింది.

ఇదిలా ఉండగా, ఏపీ జూడా రాష్ట్రవ్యాప్త సమ్మె శుక్రవారంతో 12వ రోజుకు, ఫేజ్--3లో ఐదో రోజుకు చేరుకుంది. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన రెసిడెంట్లు, ఇంటర్న్‌లు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుత నిరసన కొనసాగించారు. ఉదయం న్యాయబద్ధమైన డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేస్తూ ప్రభుత్వం చర్చలకు ముందుకు రావాలని కోరగా, సాయంత్రం 6.30 గంటలకు ఫ్లాష్‌లైట్లతో ఐక్యతకు ప్రతీకగా ప్రత్యేక ఫార్మేషన్ నిర్వహించి, ఓపీ గేట్ నుంచి ఎమర్జెన్సీ గేట్ వరకు శాంతియుత ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ స్పందన కోసం మరో రెండు రోజులు వేచి చూడాలని ఏపీ జూడా నిర్ణయించింది. ఈ వ్యవధిలో ప్రభుత్వం ఉన్నతస్థాయి ద్వైపాక్షిక చర్చలు నిర్వహించి, 20 శాతం బేస్ స్టైపెండ్ సవరణ, ఎన్ఎంసీ నిబంధనల అమలు, మెడికల్ ఫ్యాకల్టీ రిటైర్మెంట్ వయస్సు పెంపు ఉపసంహరణపై లిఖితపూర్వక ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని కోరింది. రెండు రోజుల్లో స్పష్టమైన పరిష్కారం రాకపోతే ఉద్యమాన్ని తుది దశకు తీసుకెళ్లే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467